సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 07.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 216
పేజీలు: 06 వెల: రూ. 5


## ₹లక్ష కోట్ల భూ దోపిడీకి స్కెచ్

**సీఎం సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు బందిపోట్ల మాదిరిగా దోచుకుంటున్నారు**

### టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

- వాళ్ల దోపిడీ ని ఆధారాలతో బయటపెడతా
- 20 ఏళ్లు పార్టీని బొందపెట్టే పనులు రేవంత్ రెడ్డి చేస్తున్నడు
- బీఆర్ఎస్ ఉన్నప్పుడు భూ దోపిడికి కిటికీలు తెరిస్తే రేవంత్ తలుపు తెరిచాడు



- 10 ఎకరాల శిఖం భూమి కొన్న పవన్ కళ్యాణ్ వెంటనే తిరిగి ఇచ్చేయాలి
- కచ్చితంగా తెలంగాణ మా జాగీరే

02



- పాతబస్తీలో హైటెన్షన్ పోరు ఖాయం
- ఎంఐఎంకు గట్టి సవాల్ విసురుతున్న కూటమి
- యువత అసంతృప్తే ప్రతిపక్షాల అస్త్రం
- ఎంబీటీ క్యాడర్‌తో కాంగ్రెస్ దూకుడు
- సెంటిమెంట్ వర్సెస్ అభివృద్ధి పోరు
- పాతబస్తీలో త్రిముఖ పోరు ఆసక్తికరం
- ఎంఐఎం గడ్డలో మార్పు గాలి?
- గ్రేటర్ సమరానికి ముందే రాజకీయ వేడి

## పాతబస్తీపై

# ఉమ్మడి దాడి!

### ఎంఐఎం కోటను బదలు కొట్టేందుకు కాంగ్రెస్–ఎంబీటీ వ్యూహం

### గ్రేటర్ సమరానికి ముందు మారుతున్న సమీకరణాలు

**ముద్ర డెస్క్:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల వేడి మొదలు కాకముందే పాతబస్తీ రాజకీయాల్లో సంచలనాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దశాబ్దాలుగా ఎంఐఎం అప్రతిహత ఆధిపత్యానికి కేంద్రంగా నిలిచిన పాతబస్తీలో ఈసారి కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. ఎంఐఎం గుత్తాధిపత్యానికి చెక్ పెట్టాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ, మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ)తో చేతులు కలిపే దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

**ఎంఐఎం కోటపై కాంగ్రెస్ గురి**
చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని డివిజన్లు ఎన్నో ఏళ్లుగా ఎంఐఎంకు కంచు కోటలుగా నిలిచాయి. అయితే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈసారి పాత బస్తీని వదిలేయాలనే ఆలోచనలో లేదని స్పష్టమవుతోంది. ఎంఐఎం వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూడడంతో పాటు, స్థానిక స్థాయిలో బలమైన ప్రభావం కలిగిన ఎంబీటీతో అవగాహన ఏర్పరచుకుని ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం.

**ఎంబీటీ క్యాడర్ కాంగ్రెస్‌కు బలమా?**
అమన్‌నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఎంబీటీకి ఉన్న బలమైన వాలంటీర్ నెట్‌వర్క్ కాంగ్రెస్‌కు కొత్త బలం చేకూర్చే అవకాశం కనిపిస్తోంది. గల్లీ స్థాయిలో బూత్ నిర్వహణలో ఎదురవుతున్న లోటును ఎంబీటీ సహకారంతో అధిగమించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. స్థానిక సమస్యలపై ఎంబీటీ చేస్తున్న పోరాటాలు కూడా కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**సెంటిమెంట్ కంటే సమస్యలే అజెండా**
ఈసారి పాతబస్తీ రాజకీయాల్లో ప్రధాన మార్పు యువత వైఖరిలో కనిపిస్తోంది. గతంలో మతపరమైన భావోద్వేగాలు ఎన్నికలను ప్రభావితం చేసినప్పటికీ, ఇప్పుడు యువత అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాల అంశాలను ముందుకు తెస్తోంది. డ్రైనేజీ సమస్యలు, కలుషిత తాగునీరు, వర్షాకాలంలో మునిగిపోయే రహదారులు, నిరుద్యోగం వంటి సమస్యలపై పెరుగుతున్న అసంతృప్తిని కాంగ్రెస్–ఎంబీటీ కూటమి ప్రధాన ఎన్నికల అస్త్రంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. మిగతా 02లో

## బొగ్గు

# తగ్గుతోంది

ఇప్పుడు ఉన్నవి 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే

*2014 – 2024 మధ్య సగటున 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు*

- గతంతో పోల్చితే ఇదే అతి తక్కువ బొగ్గు స్టాక్
- చేయబోయే పనిపై సంపూర్ణ అవగాహన కోసమే సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన
- కాంట్రాక్టులు మధ్యలో ఆపేసిన ఉదంతాలతోనే నిబంధన అమలు
- మెడికల్ బోర్డుపై బాధితులు, యాజమాన్యం ఫిర్యాదుల నేపథ్యంలో కొనసాగుతున్న ఏసీబీ విచారణ
- మెడికల్ బోర్డు కేసులో ఇప్పటికే ఇద్దరి అరెస్టు
- వివరణ ఇచ్చిన సింగరేణి యాజమాన్యం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
137 ఏళ్లుగా మైనింగ్ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ దశాబ్దాలుగా దక్షిణాదిలో పలు రాష్ట్రాలకు నిరాటంకంగా బొగ్గు రవాణా చేస్తోంది. ఇందుకోసం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా ప్రతి నిత్యం రవాణా చేయడం జరుగుతోంది. 39 గనులు ఉన్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్‌గా ఉండటం అత్యంత సహజం.

**ఎంత స్టాక్ ఉందంటే..**
ఈ ఏడాది కూడా సింగరేణి సంస్థలో ఈ నెల 4వ తేదీ వరకు 26.51 లక్షల టన్నుల బొగ్గు వివిధ ఏరియాల్లోని గనులు, సీహెచ్పీల్లో నిలువగా ఉంది. ఇది గత పదేళ్ల స్టాక్ చరిత్రలో అత్యల్పం. స్టాక్ గా ఉన్న బొగ్గును ఎప్పటికప్పుడు రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా అవసరమైన వినియోగదారులకు రవాణా చేయడం జరుగుతుంది. ఇది బొగ్గు కంపెనీలలో ఒక సహజమైన రవాణా పరిణామం.

**గతంలో సగటున 50 లక్షల నిల్వలు..**
ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరిగే నవంబరు నుంచి మే మాసాల మధ్య బొగ్గు నిల్వలు పేరుకుపోతూ ఉంటాయి. ఇలా ఉన్న బొగ్గు నిల్వలను పలు కారణాల వల్ల ఉత్పత్తి తగ్గిన సమయంలో వీటిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా థర్మల్ కేంద్రాలకు సరఫరా చేస్తూ రావడం ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తున్న ఆనవాయితీ. మిగతా 02లో

## అధికారం కోసం కేసీఆర్ ఏమైనా చేస్తారు



- నా ఫోనే కాదు.. హరీశ్ రావు ఫోనునూ ట్యాప్ చేయించారు
- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

02

## బియ్యం ఎగుమతులకు తెలంగాణ కేంద్రంగా మారాలి

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



- ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు ప్రోత్సాహకాలు పరిశీలన
- ధాన్యం నిల్వ చేసేందుకు ఆధునీకరణకు ప్రాధాన్యం
- ఆధునిక గోదాములు, స్టీల్ సైలోల నిర్మాణానికి పెట్టుబడులు

02

### చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లు

## పటిష్టంగా ఉండాలి

**హైదరాబాద్ ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తో కలిసి ఏర్పాట్లు పరిశీలన 02



### జవహర్‌నగర్‌లో సంచలన దోపిడీ కేసు ఛేదన..

## నేపాలీ ముఠా అరెస్ట్



- 60 తులాల బంగారం స్వాధీనం.. నిందితులు కటకటాలకు..
- పనిమనిషితో రెక్కీ.. పక్కా ప్లాన్‌తో దోపిడీ
- సీసీటీవీ ఆధారాలతో ముఠాను పట్టుకున్న పోలీసులు
- 'మీ సురక్ష'తో భద్రత మరింత కట్టుదిట్టం

02

### ఢిల్లీపై 'కాక్రోచ్'

## దండయాత్ర

**బొద్దింక మాస్కులతో ఢిల్లీలో యువత ఆగ్రహ గర్జన**

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా
- కాక్రోచ్ జనతా పార్టీ తొలి పోరాటం.. వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- అమెరికా నుంచి వచ్చి ఆందోళనకు నేతృత్వం వహించిన అభిజిత్ దీప్కే
- జాతీయ పతాకం, రాజ్యాంగ ప్రతులతో కేంద్రానికి నిరసన సెగ

02



## తేల్చుకుందాం రా..

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు**



- ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదు
- ధాన్యం కొనుకోళ్లపై గణాంకాల మీద చర్చకు మేం సిద్ధం
- రేవంత్ మీరు.. గౌరవప్రదంగా మాట్లాడితే మీకూ మాకు గౌరవం

02

## దక్షిణాదిపై

# వివక్ష

**తెలంగాణే భవిష్యత్ వృద్ధి కేంద్రం**


**సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

- కేంద్రంలోని కీలక పదవులన్నీ ఉత్తరాది నేతలకే
- దక్షిణాది రాష్ట్రాలు పన్నులు చెల్లిస్తున్నా తగిన గౌరవం దక్కడం లేదు
- తెలంగాణను 'చైనా ప్లస్ వన్' ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దుతాం
- గుజరాత్ మోడల్‌పై విమర్శలు.. పెట్టుబడుల విషయంలో అసమానతలున్నాయి
- చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటు చేశాం

**ముద్ర, హైదరాబాద్ :**
బెంగళూరులో నిర్వహించిన ఓ మీడియా సంస్థ సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'బై, ఫర్, అండ్ ఆఫ్ ది పీపుల్: గుడ్ గవర్నెన్స్ ఫర్ తెలంగాణ' అం శంపై ప్రసంగించిన ఆయన, కేంద్ర ప్రభుత్వ విధానాలు, దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష, తెలంగాణ అభివృద్ధి దిశగా తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విస్తృతంగా మాట్లాడారు. దేశంలోని అత్యున్నత పదవులు ప్రధానంగా ఉత్తరాది నేతలకే దక్కుతున్నాయని, కేంద్రానికి అధిక పన్నులు చెల్లిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆయన ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధిలో తన పోటీ ఇతర భారతీయ రాష్ట్రాలతో కాకుండా చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతోనేనని పేర్కొన్నారు. మిగతా 02లో




### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 07.06.2026
www.mudranews.in | @mudranews



### దైవ దర్శనానికి వెళ్తే పాటించాల్సిన నియమాలు



సమయానికి చేరుకోండిద ర్శనానికి తొందరపడ కుండా ముందుగానే ఆల యానికి చేరుకోవడం మంచిది. ప్రశాంతంగా దైవ సేవలో పాల్గొనవచ్చు.

# బొగ్గు తగ్గుతోంది

(మొదటి పేజీ తరువాయి)

2014 నుంచి కూడా ఇదే విధంగా బొగ్గు నిల్వలు ఉంటున్న విషయం గమనార్హం. 2015-16లో 70 లక్షల టన్నులు, 2016-17 లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డు అయింది. 2014 నుంచి 2024 వరకు సగటును 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సీహెచ్పీల వద్ద ఉన్న విషయం గమనార్హం.

**థర్మల్ విద్యుత్ కోసం అత్యవసరం**

ముఖ్యంగా వర్షాకాలం కోసం కూడా బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరం. లేనిపక్షంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గును రవాణా చేయలేని పరిస్థితులు ఉంటాయి. థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలకు 15 రోజులపాటు సరిపడేలా కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచడం జరుగుతుంది. తద్వారా వర్షాకాలంలో విద్యుత్ కేంద్రాలకు నిరాటంకంగా బొగ్గు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దేశంలో ప్రతీ బొగ్గు కంపెనీ వద్ద కూడా ఇలాంటి నిల్వలు ఉండటం అత్యంత సహజం. అవసరం కూడా.

**సైట్ విజిట్ సర్టిఫికేట్ ఎందుకు ప్రవేశపెట్టామంటే...**

సింగరేణి కాలరీస్ లో ఓవర్ బర్డెన్ తొలగింపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అతి కీలకమైనది. సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు పొరలపై ఉండే పైమట్టి (ఓవర్ బర్డెన్)ను సకాలంలో తొలగించాల్సి ఉంటుంది. ఈ ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టడం జరుగుతుంది. సింగరేణి కాంట్రాక్టులను బహిరంగ టెండర్ల ద్వారానే కాంట్రాక్టర్లకు అప్పగించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎక్కువశాతం ఓవర్ బర్డెన్ టెండర్లలో, కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక–గనుల పరిస్థితులు, సామాజిక–రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు మొదలైన వాటిని సమగ్రంగా అంచనా వేయకుండా టెండర్లలో పాల్గొంటున్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన, అంచనా లేక కొందరు కాంట్రాక్టర్లు ఓవర్ బర్డెన్ పనులను ఆపివేయడం లేదా మందకొడిగా నిర్వహించడం వంటివి చేశారు. దీని ఫలితంగా పనితీరు దెబ్బతిని, సింగరేణికి బొగ్గు ఉత్పత్తి లో నష్టం, కాంట్రాక్టర్లకు ఆర్థిక నష్టం జరుగుతూ, న్యాయ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. శ్రీరాంపూర్ ఓసీ-2 ప్రాజెక్టులో, శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీలో సైట్ ను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను మధ్యలో వదిలేయడం జరిగింది. ఫలితంగా కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలకు విఘాతం కలిగింది.



**సైట్ విజిట్ ముఖ్య ఉద్దేశం ఇదే..**

టెండర్లలో పాల్గొనే వారు పని ప్రదేశ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, పనుల పరిధి తదితర అంశాలను పూర్తిగా అవగాహన చేసుకోవడమే సైట్ విజిట్ ముఖ్య ఉద్దేశం. అన్ని పరిస్థితులు, మార్పులను పరిగణలోకి తీసుకొని రేట్లు కోట్ చేస్తాదని నిర్ధారించడమే దీని లక్ష్యం. ఇది పోటీని పరిమితం చేయడానికి మాత్రం కాదు. ఆరోగ్యకరమైన పోటీ మరియు పనుల సమర్థవంతమైన అమలుకు దోహదపడేందుకు తీసుకున్న చర్య. సంపూర్ణ అవగాహనతో పకడ్బందీ ప్రణాళికతో ఓబి తొలగింపు జరుగుతుందని భావిస్తూ తీసుకున్న చర్య.

**ఎప్పటి నుంచి ప్రవేశపెట్టారు..**

**ఫలితం ఎలా ఉంది..**

సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన కేవలం సింగరేణిలోనే కాదు అనేక ప్రభుత్వ సంస్థలలో, ప్రైవేటు సంస్థల్లో కూడా ఇప్పటికే అమలులో ఉంది. సింగరేణిలో మే 2025 నుండి ఓవర్ బర్డెన్ టెండర్లకు సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఇప్పటికే జీఎండిసి (గుజరాత్), జీఐపిసిఎల్, ఎన్‌ఎండిసి, కొన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టులు, ఈపిసి కాంట్రాక్టుల్లో అమల్లో ఉంది. సింగరేణిలోనే 2018, 2021, 2023 సంవత్సరాల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లకు CMPDI (కోల్ ఇండియా అనుబంధ సంస్థ) సలహా మేరకు సైట్ విజిట్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత మంజూరైన టెండర్లు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి పనితీరుతో కొనసాగుతున్నాయి. సదరు కాంట్రాక్టు పనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిరాటంకంగా జరుగుతున్నాయి. ఇతర సంస్థలలో కూడా సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం అమల్లో ఉండటం, కాంట్రాక్టర్ల నుండి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. సైట్ విజిట్ కోసం వచ్చే అన్ని కాంట్రాక్టర్లకు సింగరేణి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, సైట్ను సందర్శించిన ప్రతి కాంట్రాక్టర్కు సైట్ విజిట్ సర్టిఫికెట్లను సింగరేణి జారీ చేస్తోంది.

**గత మెడికల్ బోర్డుల పై ఏసీబీ విచారణ...**

సింగరేణిలో డిపెండెంట్, కారుణ్య ఉద్యోగాల నియామకాల కోసం మెడికల్ బోర్డును కొనసాగించడం జరుగుతోంది. అయితే ఈ ఉద్యోగ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, పలువురు దళారులుగా మారి అమాయకులైన కార్మికులను మోసం చేస్తూ పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు ప్రక్షాళనలో భాగంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. ఏసీబీ విచారణలో ఇద్దరు ఉద్యోగుల ను అరెస్టు చేయడం కూడా జరిగింది. వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరిగింది. ఈ మొత్తం వ్యవహారంపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. మరోవైపు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా ఈ ఆరోపణలపై డిపార్ట్మెంటల్ ఎంక్వైరీ కొనసాగిస్తోంది.

# దక్షిణాదిపై వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చెరువులు, జలవనరుల ఆక్రమణలను అరికట్టేందుకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఇందుకు వేలాది మంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని నియమించామని వెల్లడించారు. యువతను మత్తు పదార్థాల బారినుంచి కాపాడేందుకు ఈగిల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఉద్యోగావకాశాల కల్పన వంటి అంశాలను కూడా సీఎం ప్రస్తావించారు. తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సుస్థిర వృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పాతబస్తీపై ఉమ్మడి దాడి!

(మొదటి పేజీ తరువాయి)

**'అధికార బలం' కార్డుతో కాంగ్రెస్**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా పాతబస్తీ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురాగలమనే సందేశాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. "అభివృద్ధి కోసం అధికారంతో అనుసంధానం అవసరం" అనే వాదనను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతోంది.

**ఎంఐఎం అప్రమత్తం**

మరోవైపు ఈ రాజకీయ పరిణామాలను ఎంఐఎం కూడా అత్యంత గంభీరంగా పరిగణిస్తోంది. అసంతృప్తి ఉన్న డివిజన్లలో కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడం, యువతకు ప్రాధాన్యం కల్పించడం, యాంటీ ఇంకంబెన్సీని తగ్గించే చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అలాగే పాతబస్తీలో ముస్లింల రాజకీయ అస్తిత్వాన్ని కాపాడగల శక్తి ఎంఐఎమే అన్న సెంటిమెంట్‌ను మరోసారి ముందుకు తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**హై వోల్టేజ్ పోరుకు రంగం సిద్ధం**

అధికార కాంగ్రెస్ బలం, ఎంబీటీ స్థానిక క్యాడర్, యువతలో పెరుగుతున్న పౌర అసంతృప్తి ఒకవైపు.. ఎంఐఎం సంప్రదాయ ఓటు బ్యాంకు, బలమైన సంస్థాగత నిర్మాణం మరోవైపు. ఈ నేపథ్యంలో పాతబస్తీలో రాబోయే గ్రేటర్ ఎన్నికలు గత ఎన్నికలకన్నా భిన్నంగా, అత్యంత ఉత్కంఠభరితంగా మారనున్నాయి. ఎంఐఎం తన కోటను నిలబెట్టుకుంటుందా? లేక కాంగ్రెస్–ఎంబీటీ కూటమి కొత్త రాజకీయ చరిత్ర సృష్టిస్తుందా? అన్నది రాబోయే ఎన్నికలే తేల్చనున్నాయి.

# అధికారం కోసం కేసీఆర్ ఏమైనా చేస్తారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గత బీఆర్ఎస్ సర్కార్ పాలనలో అప్పటి ప్రతిపక్ష నేతలతో పాటు సొంత పార్టీ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ కు గురయ్యాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో హరీశ్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ విషయం బీఆర్ఎస్ నేతలకు కూడా తెలుసన్నారు. సొంత పార్టీ నేతల ఫోన్‌లను కూడా కేసీఆర్ ట్యాపింగ్ చేయించారని.. అధికారం కోసం కేసీఆర్ ఏమైనా చేస్తారని దుయ్యబట్టారు. అందులో భాగంగానే ప్రతిపక్ష నేతలు, కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేయించారన్నారు. ట్యాప్ నిందితులకు శిక్ష పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శనివారం ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కిరణ్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. గతంలో చామల ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనలో కిరణ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఎన్నికల వ్యూహాలను పసిగట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. తాను మీడియా కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారని ఎంపీ తెలిపారు. నిజాం పాలనలో నిజాం రాజు.. రజాకార్లపై కూడా ఇంతలా నిఘా పెట్టి వేధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తన ఐఫోన్‌కి అలర్ట్ వచ్చిందని.. అయితే అది నార్మల్‌గా వచ్చే అలర్ట్ అని భావించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడే విషయాలన్నీ తెలుసుకునేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వేరే పార్టీకి వెళ్లే వాళ్లని ముందుగానే గుర్తించి బెదిరింపులకి పాల్పడినట్లు ఆరోపించారు.

# రూ. లక్ష కోట్ల భూ దోపిడీకి స్కెచ్

## టీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో రూ. లక్ష కోట్ల విలువైన భూములను బడా సంస్థలకు అప్పగించే భారీ భూదోపిడీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెరలేపిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, సీఎం సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తెలంగాణ వనరులను దోచుకుంటున్నారని విమర్శించారు. మూసీ నది పరివాహక ప్రాంతం, చెరువుల భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన ఆధారాలను త్వరలో ప్రజల ముందుంచుతామని తెలిపారు.

అలాగే, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొనుగోలు చేసిన కోడికుంట చెరువు పరిధిలోని 10 ఎకరాల భూమి శిఖం భూమేనని, దానిని వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వం, వనరులను కాపాడేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడుతామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశం అవుతుందని, భూదోపిడీ, అవినీతి ఆరోపణలతో ప్రజలు ఆ పార్టీని తిరస్కరిస్తారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారులకు భూములు కేటాయించాలని, ఉద్యమకారుల హక్కుల కోసం భూపోరాటాలు చేపడతామని తెలిపారు. అలాగే రాష్ట్ర జలహక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో విఫలమైందని ఆరోపించారు.

# చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లో మృగశిర కార్తె సందర్భంగా జరిగే చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించిన హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెల 8వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమవుతుందని, 9వ తేదీ వరకు నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో ఫ్యాన్లు, కూలర్లు, తాగునీరు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, సీపీఆర్ బృందాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు షీ టీమ్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈసారి సుమారు 1.40 లక్షల కొర్రమీను చేప పిల్లలను మత్స్యశాఖ సిద్ధం చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. విశ్వాసంతో వచ్చే ప్రతి ఒక్కరికీ చివరి వ్యక్తి వరకు చేప ప్రసాదం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# తేల్చుకుందాం రా..

**ముద్ర, వరంగల్ :**

వరంగల్ పర్యటనలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారం కోల్పోయిన వారికి తిరిగి అధికారం రాదని, ప్రస్తుతం అధికారంలో ఉన్నవారికి కూడా మళ్లీ గెలుపుపై నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. అయితే దేశానికి మాత్రం ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నాయకత్వం వహిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు అంశంపై కేంద్రాన్ని విమర్శించే ముందు సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. గణాంకాల ఆధారంగా చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ఆయన, 2014-15లో వడ్ల కనీస మద్దతు ధర రూ.1300 ఉండగా ప్రస్తుతం రూ.2300కు పెరిగిందని పేర్కొన్నారు.



తెలంగాణలో పవన్ కల్యాణ్ సమావేశాలపై బీఆర్ఎస్ నేత కవిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ స్థాపించి రాజకీయాలు చేసే హక్కు ఉందన్నారు. పవన్ కల్యాణ్‌పై ఎందుకు అంత ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించిన రఘునందన్ రావు, రాజకీయ ప్రత్యర్థులపై ద్వంద్వ వైఖరి సరికాదని విమర్శించారు.

# బియ్యం ఎగుమతులకు తెలంగాణ కేంద్రంగా మారాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణను దేశంలోనే అగ్రగామి వరి ఉత్పత్తి రాష్ట్రంగా నిలిపిన తర్వాత, బియ్యం ఎగుమతులు, ఆధునిక సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగాల్లో ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో-2026లో పాల్గొన్న మంత్రి, ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ, ఆటోమేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్టీల్ సైలోలు, ఆటోమేటెడ్ గోదాములు, ఏఐ ఆధారిత ధాన్య పర్యవేక్షణ వ్యవస్థలు వంటి ఆధునిక నిల్వ సదుపాయాల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకు రావాల ని పిలుపునిచ్చారు. పర్యావరణ హిత పార్బాయిలింగ్ సాంకేతికతలు, పోషక విలువలను కాపాడే ఆధునిక ప్రాసెసింగ్ విధానాల అవసరాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. ప్రస్తుతం తెలంగాణలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరుగుతోందని, దేశ యాసంగి వరి కొనుగోళ్లలో రాష్ట్ర వాటా దాదాపు 60 శాతం ఉందని తెలిపారు. రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తే తెలంగాణ బియ్యం ఉత్పత్తితో పాటు ఎగుమతులు, సాంకేతిక ఆవిష్కరణల రంగంలోనూ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఢిల్లీపై 'కాక్రోచ్' దండయాత్ర..



**ముద్ర డెస్క్:**

కాక్రోచ్ జనతా పార్టీ తన తొలి ప్రత్యక్ష పోరాటాన్ని విజయవంతం చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ తో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు వేలాది మంది యువత తరలి వచ్చారు. అమెరికా నుంచి ఈ ఉదయమే ఢిల్లీ వచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే విమానాశ్రయంలో దిగిన వెంటనే నేరుగా జంతర్ మంతర్ కు చేరుకున్నారు. అంతేకాకుండా ఆందోళన కార్యక్రమానికి ముందు శాంతియుత ఆందోళనకు అందరూ సహకరించాలని కోరుతూ ట్వీట్ చేశారు.

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాతో ఢిల్లీలోని జంతర్ మంతర్ దద్దరిల్లింది. వేలాది మంది యువత తరలిరావడంతో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కాక్రోచ్ పార్టీ ధర్నాకు ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుందా? లేదా? అన్న సంశయం మధ్య పోలీసులు సులువుగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరోవైపు 5వ తేదీలోపు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని లేదంటే తాము 6న ఆందోళన చేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. కాక్రోచ్ పార్టీ డిమాండ్ నెరవేరకపోవడంతో అమెరికా నుంచి ఢిల్లీకి వచ్చిన కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నేరుగా జంతర్ మంతర్ కు వెళ్లి ఆందోళనకు దిగారు.

దేశంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల గొంతుకగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' పిలుపుతో జంతర్ మంతర్ వద్ద శనివారం నిర్వహించిన ధర్నా విజయవంతమైందని ప్రకటించారు. సీజేపీ పిలుపు మేరకు వేలాది మంది యువత రోడ్డుపైకి వచ్చారు. బొద్దింకల ఫొటోతో ఉన్న మాస్క్ తోపాటు చేతిలో జాతీయ పతాకం, రాజ్యాంగ ప్రతిని పట్టుకుని రావాలని సీజేపీ పిలుపుతో చాలా మంది ఆందోళనకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టిగా నినాదాలు చేశారు.

# జవహర్‌నగర్‌లో సంచలన దోపిడీ కేసు ఛేదన..

**ముద్ర మల్కాజ్ గిరి:**

మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన సంచలన గృహ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. కౌకూర్‌లోని మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న అంతర్జాతీయ మధ్యవర్తి మురళీ మోహన్ నర్సిపురం ఇంట్లో మే 11 రాత్రి దోపిడీ జరిగినట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల విచారణలో, భారత్‌లో గత కొంత కాలంగా పనిచేస్తున్న నేపాలీ జాతీయులకు చెందిన ముఠా ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది. ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే ఉండటాన్ని గమనించిన నిందితులు ముందస్తు పథకం ప్రకారం ఇంటి పనిమనిషిగా ఒక మహిళను నియమించి, ఇంటి యజమానుల దినచర్యను పరిశీలించారు. మే 11 రాత్రి వృద్ధ దంపతులను అదుపులోకి తీసుకుని, మత్తు పదార్థం ఇచ్చి స్పృహ తప్పేలా చేసి, చేతులు కాళ్లు కట్టేసి, ఇనుప రాడ్లతో బెదిరించి బీరువాలు పగులగొట్టి సుమారు 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కిలోల వెండి వస్తువులు, 3,000 అమెరికన్ డాలర్లు, రెండు మొబైల్ ఫోన్లు తదితర విలువైన వస్తువులను అపహరించారు. కేసు నమోదు చేసిన వెంటనే మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్, ఎస్‌వోటీ, సీసీఎస్ విభాగాలకు చెందిన ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా పలు నగరాలు, నేపాల్‌లో సైతం గాలింపు చర్యలు చేపట్టి, సీసీటీవీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, వేలిముద్రల విశ్లేషణ ద్వారా నిందితులను గుర్తించారు.

నిందితులు మీనా, రాజేష్, డేనియల్ చారోహ్ అలియాస్ చాంగ్, కిరణ్‌తో పాటు మిగతా నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దోచుకున్న బంగారం, వెండి వస్తువులు, ఇతర విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులైన మీనా, రాజేష్ గతంలో కూడా ఒక గృహ చోరీ కేసులో నిందితులుగా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి అభినందించారు ప్రజల భద్రత కోసం "మీ సురక్ష" కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేస్తున్నట్లు సిపి తెలిపారు. భాగంగా గృహ పనివారు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు తదితరుల వివరాలను సేకరిస్తుండగా, ఇప్పటివరకు 39,270 మంది వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి తమ కాలనీల భద్రతకు తోడ్పడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 07.06.2026
www.mudranews.in | @mudranews



**దైవ దర్శనానికి వెళ్తే పాటించాల్సిన నియమాలు**

**మౌనం, భక్తి పాటించండి**



ఆలయంలో పెద్దగా మాట్లాడటం లేదా హడావిడి చేయడం నివారించాలి. భక్తి భావంతో దైవాన్ని స్మరించాలి.

### జాతీయ స్టీల్ కన్స్యూమర్ ఫోరం

## వైస్ చైర్మన్ గా సీహెచ్ శ్రీనివాస్



**ముద్ర, హైదరాబాద్:** స్టీల్ పరిశ్రమల అభివృద్ధి, వినియోగదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న స్టీల్ కన్స్యూమర్ ఫోరం (ఎస్‌సీఎఫ్) జాతీయ వైస్ చైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ నివేదిత శర్మ ప్రేమ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ అమలు చేస్తున్న కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం, భారత ప్రభుత్వ కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీమ్ నేపథ్యంలో స్టీల్ పరిశ్రమలకు అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు కార్బన్ అకౌంటింగ్, ఈఎస్‌జీ ప్రమాణాలు, ఉద్గారాల నివేదికలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దక్షిణ భారత రాష్ట్రాల్లో అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడంతో పాటు పరిశ్రమలకు సాంకేతిక సహాయం అందించే దిశగా ఫోరంను బలోపేతం చేయాలని ప్రతిపాదించారు.

కార్బన్ కంప్లయన్స్ రంగంలో విశ్వసనీయ సంస్థగా ఎదిగితే స్టీల్ కన్స్యూమర్ ఫోరం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలదని సీహెచ్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

## బాలాజీ నగర్‌లో బండి రమేష్ పాదయాత్ర



**ముద్ర కూకట్ పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీ నగర్ డివిజన్ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ శనివారం విస్తృత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, మహిళలు ఆయనకు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

పాదయాత్రలో భాగంగా ప్రతి వీధిని సందర్శించిన బండి రమేష్‌కు స్థానికులు తమ డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితిని వివరించి, వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న రోడ్డును 60 అడుగులకు విస్తరించి, డివైడర్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై ప్రజలు వ్యక్తంచేసిన ఆందోళనలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో భారీగా అభివృద్ధి చేశామని చెప్పుకున్నా, క్షేత్రస్థాయిలో ఇంకా ఇన్ని సమస్యలు ఉండటం విచారకరం. అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న రోడ్డును ప్రభుత్వం ఇప్పటికే రూ.1 కోటి నిధులతో 40 అడుగుల రహదారిగా మంజూరు చేసింది. రోడ్డు విస్తరణపై ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అధికారులతో చర్చించి అందరికీ అనుకూలమైన నిర్ణయం తీసుకుంటాం. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఆయన, పెద్ద సమస్యలను అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాను మళ్లీ పాదయాత్రకు వచ్చేసరికి బాలాజీ నగర్‌లో ఎలాంటి సమస్యలు మిగలకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రభుత్వ అధికార లాంఛనాలతో

## ఏఆర్ కానిస్టేబుల్ రాజు అంత్యక్రియలు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఉల్పర గ్రామంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ గౌరవ వందనాలతో అంతిమ సంస్కారాలు చేపట్టింది.

శుక్రవారం సాయంత్రం మామిళ్లపల్లి గ్రామ సమీపంలో ముఖ్యమంత్రి బందోబస్తు విధులు ముగించుకొని తిరిగి వస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై రాజు మృతి చెందిన విషయం తెలిసిందే. అంత్యక్రియలకు హాజరైన అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు రాజు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పోలీసు శాఖ తరపున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.30,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రాజు కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జగన్, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీ, ఉప్పునుంతల ఎస్సై మహేష్‌తో పాటు జిల్లా పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజుకు ఘన నివాళులు అర్పించారు.

# పెండింగ్ భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**- ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్**



**ముద్ర, వనపర్తి:**

జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు అత్యంత వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే శివకుమార్ నాయుడు ఆదేశించారు. తెలంగాణ ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు శనివారం వనపర్తి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టుల విషయంలో భూసేకరణ పనులు పూర్తి చేయడం ప్రథమ ప్రాధాన్యతగా పనిచేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా సూచించినట్లు తెలిపారు. ఆ దిశగా జిల్లాలోని రెవెన్యూ, నీటి పారుదల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు కీలకమైన ప్రాంతాల్లో భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో గణపసముద్రం ప్రాజెక్టులో భాగంగా పెండింగ్లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు గాను 164 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, రైతులను ఒప్పించి అవార్డు కూడా త్వరగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి పెండింగ్ 17 ఎకరాల భూసేకరణకు సంబంధించి సోమవారంలోగా ప్రతిపాదనలు పంపాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజ్ 29 కు సంబంధించి మైనర్ కెనాల్స్ 77 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ త్వరగా పూర్తిచేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ కు సంబంధించి 30 ఎకరాల భూమికి సంబంధించి పెగ్ మార్కింగ్ పూర్తిచేసి, ఎస్ డి ఆర్ స్టేజిలో ఉన్న 60 ఎకరాలకు కూడా త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. బుద్దారం పెద్ద చెరువుకు సంబంధించి నోటిఫికేషన్ జారీచేసిన 101 ఎకరాల భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడి అవార్డు వేగంగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాన్ చెరువుకు సంబంధించి చందాపూర్, సవాయిగూడెం, పెద్దగూడెం గ్రామాల పరిధిలో అటవీ భూమి అంశంపై అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పర్వేష్ పోర్టల్ లో త్వరగా అనుమతులు పొందే విధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో భూసేకరణలో భాగంగా అవార్డ్స్ జారీ చేసిన వాటికి సంబంధించి టోకెన్స్ రైజ్ చేస్తే త్వరితగతిన నగదు బదిలీ అయ్యే అవకాశం ఉంటుందని తెలియజేశారు.

ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్ , ఎస్ ఈ చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య సుబ్రహ్మణ్యం, సర్వే ఏడి శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు, ఇతర నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి



**- కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**

**ముద్ర, నారాయణ పేట:**

వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. మరికల్ మండలం పెద్దచింతకుంట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తడి, పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడంతో పాటు మొక్కలు నాటడం, జల సంరక్షణ చర్యలు అమలు చేయాలని పేర్కొన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాల్వలను ప్రతిరోజూ శుభ్రం చేయించి, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అలాగే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను, రైతుల నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## కాంగ్రెస్ కు కాంట్రాక్టర్ల అల్టిమేటం



**- పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే జూన్ 18న 'చలో హైదరాబాద్'**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.20 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిల్లులు అందక కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిర్మాణ రంగం సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ పేమెంట్ విధానాన్నే కొనసాగిస్తూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా రోడ్లు, భవనాల శాఖలోనే రూ.3 వేల కోట్ల బకాయిలు ఉండటంతో అనేక మంది కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో చిక్కుకున్నారని తెలిపారు. పాత బిల్ మానిటరింగ్ విధానాన్ని పునరుద్ధరించి, సీనియారిటీ ప్రకారం బిల్లులు విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం స్పందించకపోతే జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించే "మా బిల్లులు – రాష్ట్ర అభివృద్ధి" మహాసభ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్ల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో కాంట్రాక్టర్లు డి.వి.ఎన్. రెడ్డి, ఎస్.ఎన్. రెడ్డి, సి.హెచ్. పవన్, జి. సంతోష్ రెడ్డి, ఆదిత్య సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్**




**ముద్ర, శేరిలింగంపల్లి :**

విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు, విద్యా సంస్థల రవాణా నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనంలో సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థలు, అత్యవసర భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహనం వివరాలు, డ్రైవర్ సమాచారం, ప్రయాణ మార్గం, ప్రస్తుత లొకేషన్ తదితర అంశాలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

అలాగే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా విద్యార్థుల రవాణా వాహనాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే వ్యవస్థను అమలు చేయనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల అమలు, సమర్థవంతమైన రవాణా సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని సీపీ పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, శేరిలింగంపల్లి ఎడిసిపి హనుమంతరావు, ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ శీతల్ సోహన్, మేడ్చల్ డిటిఓ శ్రీనివాస్, ఆర్టీసీ డిఎం మియాపూర్-1 ప్రశాంత్ మియాపూర్ -2 వెంకటేశం ఇతర ఉన్న అధికారులు పాల్గొన్నారు.

## సీఎం సభా ప్రాంగణం పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం పరిశీలించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ మొండికుంట చెరువు వద్ద నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయ స్థలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ అధికారులు ఎస్ఇ శ్రీకాంతిని, ఈఈ గోవర్ధన్, డీఈ రూపదేవి, దుర్గ ప్రసాద్, ప్రాజెక్ట్స్ డీఈ వరుణ్, ఎ.ఈ శ్రీ నాథ్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రజలతో మమేకమవుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. బల్మూరు మండలం జీనుకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన గ్రామస్తుల సమస్యలు, అవసరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన 80 ఏళ్ల వృద్ధుడు గోరంట్ల సంజన్నను కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి ఆయన ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితులు, పింఛన్ సక్రమంగా అందుతున్నదా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుడితో కొద్దిసేపు మాట్లాడిన కలెక్టర్, ఆయనకు అవసరమైన సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామ సభలో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించిన కలెక్టర్, సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

### దైవ దర్శనానికి వెళ్తే పాటించాల్సిన నియమాలు

ఆలయ నియమాలను గౌరవించండి. ప్రతి దేవాలయానికి కొన్ని ప్రత్యేక నియమాలు ఉంటాయి. వాటిని పాటించడం ద్వారా దైవానుగ్రహంతో పాటు క్రమశిక్షణ కూడా పెరుగుతుంది.





## కేటీఆర్ వి డైవర్షన్ పాలిటిక్స్

- కేటీఆర్ కు దమ్ముంటే విచారణ చేయించమను..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, వెల్గటూర్:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వి డైవర్షన్ పాలిటిక్స్ అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో రూ. 1600 కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరం రాసే బదులు ప్రత్యక్షంగా పరోక్షంగా బీఆర్ఎస్ కు సహకరిస్తున్న బిజెపి ప్రభుత్వంతో విచారణ చేయించమని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకి ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని మంత్రి అన్నారు. పార్టీని కాపాడుకోవడానికి కేటీఆర్ ప్రభుత్వం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫామోజుకు పరిమితం కావడం, ఇంట్లో కుటుంబ గొడవల నేపథ్యంలో ఏం చేయాలో తెలియని కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మంత్రి తెలిపారు.

## కాళేశ్వరంను మరమ్మతు చేయలేని అసమర్ధ ప్రభుత్వం

- రేవంత్ రెడ్డికి ఆయన ఫ్యూచర్ తప్ప తెలంగాణ ఫ్యూచర్ అక్కర్లేదు : జీవన్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**
ప్రమాదవశాత్తు కుంగిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేయలేని అసమర్ధ ప్రభుత్వమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత నది వినియోగం లో ఆనాడు కాంగ్రెస్ అధికారం లో ఉన్నా మహా రాష్ట్రతో ఒప్పందం కుదర్చుకోలేక పోయారని, కేసీఆర్ లౌక్యం ప్రదర్శించి మెడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. సీఎంతో మాట్లాడడానికి మధ్యవర్తి ఉండటం చుస్తే పరిస్థితి అర్థమవుతుందని, తెలంగాణ ఎండబెట్టి పోలవరానికి సీఎం రేవంత్ రెడ్డి వంత పాడుతున్నాడని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 10 శాతం పనులు చేసి కాలువ నిర్మిస్తే వినియోగంలోకి వస్తదని, కానీ తట్టుడు మట్టి ఎత్తి పోయలేదని, ఇందుకు అసమర్థుడు ముఖ్యమంత్రి సిగ్గుపడాలన్నారు. ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయక పొతే ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ ముఖ్యమంత్రి ఎన్ని రోజులు ఉంటరో వారికే తెలియదని , అలాంటిది 2029 లోనూ సీ ఏం గా ఉంటానడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డికి ఆయన ఫ్యూచర్ తప్ప తెలంగాణ ఫ్యూచర్ అక్కర్లేదని, అసిఫాబాద్ పోయిన సీఎం రేవంత్ రెడ్డి తుమ్మిడి హేట్టి వద్దకు పోలేదన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు హరిచరణ్ రావు, వెంకటేశ్వరరావు, ప్రవీణ్ ఇతర నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాపాలన - ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే గ్రామ పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వీర యోధుడు చత్రపతి శివాజీ

- నేటి యువతకు చత్రపతి ఆదర్శం
- నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలు పరిష్కరిస్తా..
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్..



**ముద్ర, వెల్గటూర్ :**
చత్రపతి శివాజీ వీర యోధుడని నేటితరం యువత చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని అనుకున్నా లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి అడ్లూరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్డూరి మాట్లాడుతూ చత్రపతి విగ్రహ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. చత్రపతి శివాజీ వీరోచిత పోరాటంతో మనం నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోనూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తున్నట్టు మంత్రి వివరించారు. మేడారం రిజర్వాయర్ నుండి కొత్తపేట వరకు 11 గ్రామాలకు ఉపయోగపడే సాగునీటి పనులు త్వరలోనే పూర్తి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ముంజంపల్లి మారేడుపల్లి గ్రామాలకు సాగునీటిని అందించే 11ఎల్ కాలువ పనులు సైతం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి ఎత్తిపోతల పథకంతో పాటు రోళ్ళ వాగు ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీటిని అందించాలని ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి కలిసి విన్నవించినట్లు మంత్రి తెలిపారు. కొత్తపేట గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి, రాంబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

- గోదావరిలో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు..
- రాష్ట్ర సాంఘీక క సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్..



**ముద్ర, ధర్మపురి:**
ధర్మపురి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికరించి ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. శనివారం ధర్మపురి పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన మంత్రి అడ్లూరి గోదావరి పుష్కర ఘాట్లతో పాటు పట్టణంలోని పలు వార్డులను సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ వచ్చే గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని మంత్రి అన్నారు. ధర్మపురి పట్టణంలో ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ధర్మపురి డ్రైనేజీ నీరు గోదావరిలో కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్థానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.



## బీజేపీ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా సుధవేణి మహేష్ గౌడ్

**ముద్ర కోరుట్ల;**
ఇందూరు పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ఆదేశానుసారం పట్టణ బీజేపీ సీనియర్ నాయకులు సుధవేణి మహేష్ గౌడ్ కు జిల్లా కార్యదర్శి గా నియమిస్తూ జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు చేతుల మీదుగా మహేష్ గౌడ్ కు నియామక పత్రం అందజేయడం జరిగింది. జిల్లాలో బీజేపీ పార్టీ ని మరింత పటిష్టంగా ముందుకు తెసుకెళ్లాలని సుధవేణి మహేష్ ను కోరారు. ఈ సందర్భంగా సుధవేణి మహేష్ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా నాకు అవకాశం కల్పించిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ సహకరించిన జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనూప్ రావు రాష్ట్ర ఓబీసీ నాయకులు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మి నారాయణ వెన్నంటే ఉన్న పట్టణ బీజేపీ, బీజేవైయమ్ నాయకులకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మ్యాకల గణేష్, గిన్నెల శ్రీకాంత్, మండల నాయకులు అంబల్ల సుదర్శన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**ముద్ర, కోరుట్ల;**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన 99 రోజుల కార్యచరణ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈనెల 4 నుంచి 10 వరకు వార్డు సభలు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు వార్డు సభల నిర్వహణలో భాగంగా శనివారం రోజు 8,9,10, 20 వార్డులకు సంబంధించిన వార్డు సభను కళా నగర్ గణపతి షెడ్డు వద్ద 11 వార్డుకు సంబంధించిన వార్డు సభను వెంకట్రావు పేట గ్రామ పంచాయతీ భవనం వద్ద, 12వ వార్డు కు సంబంధించి వార్డు సభను డి.డి నగర్ స్కూల్ వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ వార్డు సభలలో ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు సంబంధించి, అలాగే మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీ చేపట్టే, పారిశుద్ధ్య పనులు మురికి కాలువల పూడికతీత, రోడ్లు శుభ్రపరచడం, వీధి దీపాల నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటర్ నమోదు కార్యక్రమం, త్రాగునీటి సరఫరా, వర్షాకాలంలో తీసుకొనవలసిన ముందు జాగ్రత్త చర్యలు, మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ, వీటన్నింటి పైన ప్రజల భాగస్వామ్యంతో వార్డు అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను చైతన్య పరుస్తూ అన్ని వార్డులను అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డి.ఇ.ఇ నాగేశ్వర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్ రాజ్ కుమార్, సంబంధిత వార్డ్ కౌన్సిలర్లు, వార్డ్ ప్రజలు, కూడా ప్రజా ప్రతినిధులు, మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే పురపాలికల అభివృద్ధి

- కలెక్టర్ భవేష్ మిశ్రా



**ముద్ర ప్రతినిధి, నిర్మల్ :**
పురపాలికల అభివృద్ధిలో సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. భైంసా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపాలిటీ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణ చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, మొక్కల నాటకం, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు త్వరలోనే మరో సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారానికి ఈ నెల 20 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని జిల్లా జడ్జి శ్రీవాణి సూచించారు.ఇందుకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఎస్పీ డా.జి. జానకి షర్మిల హాజరయ్యారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన కేసులను గుర్తించడం, రాజీ ద్వారా పరిష్కారం సాధించే అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 07.06.2026
www.mudranews.in | @mudranews



దైవ దర్శనానికి వెళ్తే పాటించాల్సిన నియమాలు
వరుసలోనే దర్శనం చేసుకోండి



ఇతర భక్తులకు ఇబ్బంది కలిగించకుండా క్యూలోనే వెళ్లాలి. సహనం, వినయం భక్తుని లక్షణాలు.



## స్వామివారి సేవలో ప్రముఖులు

**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం హర్యాన గవర్నర్ గవర్నర్ బండారు దత్తాత్రే, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదినోత్సవం సందర్భంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభు నరసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యుల ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఏఈఓ జూసెట్టి కృష్ణ లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు మంగళగిరి నరసింహమూర్తి, సూపర్డెంట్ రాజన్ బాబు, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ మాణిక్ ప్రభు, సిబ్బంది పాండు ఉన్నారు.

### పోచంపల్లి చేనేత కళకు
## ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు



**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** పోచంపల్లి చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" చేనేత ఎగ్జిబిషన్‌ను శనివారం సందర్శించిన మంత్రి, చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ను పరిశీలించిన మంత్రి, పోచంపల్లి చేనేత వైభవాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఢిల్లీలో పలువురు ఎంపీలు, కేంద్ర మంత్రులకు పోచంపల్లి శాలువాలు బహూకరించి వాటి ప్రత్యేకతను వివరించేవాడినని గుర్తుచేశారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చని పేర్కొంటూ, ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి నాణ్యమైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, చేనేత శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి గ్రంథాలయ ఛైర్మన్ గా వీరబోయిన గంగరాజు యాదవ్



**ముద్ర, తుంగతుర్తి:** మండల కేంద్రంలోని గ్రంథాలయ చైర్మన్ గా వీరబోయిన గంగరాజు యాదవ్ నియామకమయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సామేలు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గంగరాజు యాదవ్ మాట్లాడుతూ, గ్రంథాలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు రేగటి రవి, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, మాచర్ల అనిల్, కొండ రాజు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేపటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** సోమవారం నిర్వహించు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా అధికారులు సోమవారం నిర్వహించు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పాల్గొనవలసి ఉన్నందున జూన్ 8న నిర్వహించు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# తడిసిన ధాన్యం తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

**- మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య**

**ముద్ర ,తుంగతుర్తి...**



అకాల వర్షానికి తడిసిన ధాన్యం ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలని రెండు నెలలుగా రైతులు ధాన్యాన్ని తెచ్చి కొనుగోలు కేంద్రాల్లో పోసినప్పటికి సేకరణ చేయడంలో నిర్లక్ష్యం చేసినందునే ధాన్యం తడిసిపోయిందని బి ఆర్ ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు సెంటర్లలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ తుంగతుర్తి రైతు సేవా సహాకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రంలో పరిశీలన చేసిన సందర్భంగా మాట్లాడుతూ తుంగతుర్తి మండలంలోని వెంపటి, గొట్టిపర్తి, రావులపల్లి, గానుగుబండ, కొత్తగూడెం, అన్నారం, సంగెం గ్రామాల్లో ధాన్యం సేకరణలో జాప్యం జరగడం వలన నిన్న కురిసిన వర్షానికి పూర్తిగా తడిసి పోయిందని అన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంహత్సరాలుగా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోగా సకాలంలో ఎరువులు అందచేయకున్న రైతు భరోసా ఇవ్వకున్న రుణ మాఫీ చేయకున్నా రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోస్తే సకాలంలో కాంటాల్ వేయక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వర్షానికి ధాన్యం తడిసిపోయిందని అన్నారు. లారీలు పంపక దిగుమతులు త్వరగా చేయకపోవడం అంతేగాక ధాన్యంలో కోతలు విధించడంతో రైతాంగం పూర్తిగా నష్ట పోయి అప్పులపాలయ్యారని అన్నారు. అందుకే అబద్ధాల రైతు వ్యతిరేఖ ప్రభుత్వానికి తగిన శాస్తి చేసేందుకు అవకాశం కోసం యావత్తు రైతు సంఘం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. రైతు బీమాను రద్దుచేసి రైతుల కుటుంబాలకు హాజరు లేకుండా చేశారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగానీ రాములు గౌడ్, మండల నాయకులు యాకు నాయక్. భాస్కర్. వీరన్న. వెంకటేష్. నల్లబెల్లి వెంకటేష్. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగ కాంట్రాక్టర్లను ఆదుకోవాలి





**- బీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడు వేముల సత్యమూర్తి**

**ముద్ర, హన్మకొండ:**

దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ ఉపాధ్యక్షుడు వేముల సత్యమూర్తి డిమాండ్ చేశారు. హన్మకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పనులు పూర్తిచేసినా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు రుణాలు, వడ్డీల భారం పెరిగి కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, చెల్లింపుల్లో పారదర్శకత తీసుకు రావడంతో పాటు నిర్దిష్ట గడువులో నిధులు విడుదలయ్యేలా శాశ్వత విధానం అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే జూన్ 18న కాంట్రాక్టర్ల ఉమ్మడి కార్యాచరణను ప్రకటించి కీలక నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణ రంగం సంక్షోభంలో పడితే లక్షలాది మంది కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మాజీ చైర్మన్లు బి. సుగుణాకర్ రావు, కట్కూరి దేవేందర్ రెడ్డి, యు. సురేందర్, బీఏఐ రాష్ట్ర అడ్వైజర్ కె.ప్రభాకర్ రెడ్డి, జనగామ సెంటర్ మాజీ ఛైర్మన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, వరంగల్ సెంటర్ చైర్మన్ ఈ.మనోజ్, శ్రీ వెంకటేశ్వర కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్ మాధిరెడ్డి రవిందర్ రెడ్డి, ఎంఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం

**- సీపీఐ నేత మహ్మద్ మౌలానా**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :**



ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ తమ పట్టా భూమిలో బలవంతంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రైతు మహమ్మద్ మౌలానా ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏదులాపురం రెవెన్యూ పరిధిలో తమ కుటుంబం ఏడు తరాలుగా అనుభవిస్తున్న భూమిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, న్యాయస్థానాల తీర్పులను సైతం పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల సంబంధిత అధికారులకు ప్రభుత్వ భూమి ద్వారా రోడ్డు నిర్మించాలని సూచించినప్పటికీ స్పందన రాలేదన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి తమ భూమిలో రోడ్డు పనులు చేపట్టారని ఆరోపించారు. తాను అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అవసరమైతే భూసేకరణ చట్టం ప్రకారం సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమి, కాలువ స్థలం కలిపి తగినంత విస్తీర్ణం ఉన్నప్పటికీ కక్షపూరితంగా తన భూమినే ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగిస్తామని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని మహ్మద్ మౌలానా కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు మహ్మద్ గౌస్పషా, స్థానికులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## హామీల అమలుకు 10న కలెక్టరేట్ ముట్టడి

**ముద్ర ప్రతినిధి ఖమ్మం :**



కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హనుమంతరావు తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, నివాస స్థలాల పంపిణీ వంటి ఎన్నికల హామీల అమలులో జాప్యం చేస్తోందని ఆరోపించారు.

రైతు భరోసా, ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపుల్లో కూడా నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, రైతులకు బకాయిలు చెల్లించాలని, ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు..

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### దైవ దర్శనానికి వెళ్లి
## వస్తుండగా ప్రమాదం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆటోలో జమలాపురం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా నిదానపురం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి ఆటోను ఢీకొనడంతో ఐదుగురు ప్రమాదానికి గురయ్యారు. ఐదుగురిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరిని మధిర నుండి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో చిన్న పాప కూడా ఉంది.

## నేడు డిప్యూటీ సీఎం పర్యటన

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆదివారం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గంలోని ముదిగొండ, బోనకల్ మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 11 గంటలకు ఎడవల్లి లక్ష్మిపురం గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయితి భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఎడవల్లి గ్రామంలో 33/11 సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేస్తారు.

మధ్యాహ్నం ముదిగొండ మండల కేంద్రంలో నూతన ఈఆర్వో భవనానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఎడవల్లి –తల్లంపాడు రహదారి అభివృద్ధికి, ఎడవల్లి నుంచి లక్ష్మీపురం మీదుగా తెల్దారిపల్లి పల్లి ఆర్ అండ్ బీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేస్తారు.

మధ్యాహ్నం 3 గంటలకు బోనకల్ మండలంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాల పనులను పరిశీలిస్తారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సర్వేకు సహకరించాలి

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈ నెల 24 నుండి జులై 25 వరకు జరిగే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వేకు అందరు సహకరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం కేసరం గ్రామంలో సర్పంచ్ మనోహర అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి జినుకల శ్యాంసుందర్, ఎంపీడీవో దినకర్, మండల విద్యాధికారి రంగరాజన్, వైద్యాధికారి యామిని, వ్యవసాయ అధికారి మల్లేష్, హౌసింగ్ అధికారి రామచందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేయడం కలిగే ప్రయోజనాలను రైతులకు, ప్రజలకు వివరించారు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
07.06.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### దైవ దర్శనానికి వెళ్తే పాటించాల్సిన నియమాలు

మొబైల్ వినియోగాన్ని తగ్గించండి. ఆలయంలో ఫోన్ మాట్లాడటం, సెల్ఫీలు తీసుకోవడం వంటి పనులను నివారించాలి. దైవ చింతనపై దృష్టి పెట్టాలి.





## కల్యాణ లక్ష్మీ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

చిన్న శంకరంపేట్ మండలంలోని కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ 115 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు రూ.1,05,12,480 విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులందరూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎమ్మెల్యే సహకారంతో నీటి సౌకర్యం**

నెలల తరబడిగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తన సొంత నిధులతో తాగు నీటి బోరు వేయించి సమస్య పరిష్కరించారు. చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లి తండా, మాందాపూర్, పట్టి గడ్డ తండాలలో ఎంఎస్ఎస్ఓ ద్వారా తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బోరు మోటార్లను ప్రారంభించారు. ఏ ఒక్క గ్రామం, తండా కూడా తాగునీటి సమస్యతో బాధపడకుండా చూడటమే నా లక్ష్యం అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.

**పోచమ్మ బోనాల ఉత్సవాలకు హాజరు**

హవెలి ఘనపూర్ మండలం లింసాన్‌పల్లి తండాలో శనివారం జరిగిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. గ్రామ దేవత పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

## సంస్కార భారతి సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా బండోజు నరసింహ చారి

- కార్యదర్శిగా దుబ్బాక తిరుమలేష్ నియామకం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సంస్కార భారతి సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా బండోజు నరసింహచారి, కార్యదర్శిగా దుబ్బాక తిరుమలేష్ నియామకమయ్యారు. సిద్దిపేట లో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఉమా సురేషన్ రెడ్డి ఇంట్లో సంస్కార భారతి సిద్దిపేట జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి జబల్పూర్ నిరంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా సంస్కార భారతీ అధ్యక్షులుగా బండోజు నరసింహ చారి , కార్యదర్శిగా దుబ్బాక తిరుమలేశ్ లను నియమించారు. సంస్కార భారతిని మరింత విస్తరించి , కళల మాధ్యమంగా భారత దేశ సామాజిక సమరసతకు పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- నివాళులు అర్పించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**ముద్ర ప్రతినిధి,, మెదక్ :**

శివంపేట పోలీస్ స్టేషన్ లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో కానిస్టేబుల్ మహిపాల్ రామాయంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాద ఘటన జిల్లా పోలీసు శాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మహిపాల్ 2024లో పోలీసు శాఖలో చేరి, సుమారు సంవత్సరం పాటు క్యూఆర్టీలో విధులు నిర్వహించారు. అనంతరం కొద్ది రోజుల క్రితమే బదిలీపై శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. తన స్వల్ప సేవా కాలంలోనే విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి అందరి మన్ననలు పొందాడు. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావుఅధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మహిపాల్ స్వగ్రామం కోమటిపల్లికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. మహిపాల్ అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. మహిపాల్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. వెంట డి ఎస్పీ నరేందర్ గౌడ్ తదితరులున్నారు.



## ప్రకృతిని కాపాడుదాం.. .పక్షులను సంరక్షిద్దాం

- బర్డ్ వాక్ లో అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



ప్రకృతిని కాపాడుతూ... వన్యప్రాణులు, పక్షులను సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా సరిహద్దు పోచారం(పోచంరాల్)లోని డిబిసిలో బర్డ్ వాక్ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. డీఎఫ్ఓ జోజి, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, అటవీశాఖ సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ నాలుగు కిలోమీటర్ల బర్డ్ వాక్ చేశారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ప్రోత్సహించడానికి,బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం, అభయారణ్యం చుట్టూ ఉన్న ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందని, ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని, పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి, పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతు కనకయ్యను బలి తీసుకుంది

- ఆర్థిక సహాయం అందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట నియోజకవర్గం నారాయణ రావు పేట మండల కేంద్రం కు చెందిన రైతు పల్లెవేని కనకయ్య (గద్దర్ ) గుండె పోటుతో మృతి చెందగా మృత దేహానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, వడ్ల కొనుగోలులో జరుగుతున్న అవకతవకల వల్లే ఇవాళ నారాయణరావుపేట గ్రామానికి చెందిన కనకయ్య అనే మంచి రైతు బలి అయ్యాడన్నారు. కనకయ్య పండించిన వడ్లను మార్కెట్ యార్డ్‌లో దాదాపు 45 రోజుల పాటు ఎవరూ కొనకుండా ఆలస్యం చేశారన్నారు. చివరికి వర్షం పడి ఆ వడ్లన్నీ తడిసిపోయాయన్నారు. తడిసిన వడ్లను మిల్లుకు తీసుకెళ్లి ప్రాధేయపడితే, నాలుగు ట్రాక్టర్ల వడ్లకుగాను ఏకంగా 40 సంచుల వడ్లను మిల్లర్లు కట్ చేశారన్నారు. నా 40 సంచుల వడ్లు కట్ చేసింద్రు" అని నిన్న రాత్రి వరకు తోటి రైతులతో, కుటుంబ సభ్యులతో బాధపడుతూ, ఆ టెన్షన్ లోనే నిద్రలోనే ఆయనకు గుండెపోటు వచ్చి మరణించాడు. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే అన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని 80శాతం నుంచి 90శాతం వడ్లు కొన్నామని ప్రభుత్వం చెప్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రతి ఊర్లో ఇంకా 30శాతం నుండి 40 శాతం వడ్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వాతావరణం దారుణంగా ఉంది, వర్షాలు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో రైతులు రెండు నెలలుగా వడ్లు అమ్ముకోలేక మిల్లులు, గోదాముల ముందు లారీలతో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ప్రతి క్వింటాల్‌కు 4 నుండి 5 కిలోల కోత పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పంట పండించడం సులభంగా ఉంది కానీ, ఆ పంటను అమ్ముకోవాలంటే రైతులకు కళ్ళలో రక్తం వచ్చే పరిస్థితి (నరకం) కనిపిస్తోందన్నారు. కుకునూరుపల్లి దగ్గర ఒక రాజస్థాన్ లారీలో వడ్లు ఎక్కించే ప్రయత్నం చేస్తే, ఆ లారీ వడ్లతో సహా రాజస్థాన్ వెళ్ళిపోయిందన్నారు. దుబ్బాక మండలం చేర్వాపూర్‌లో సంచులు ఎత్తకపోవడం వల్ల, అలాగే ఎన్సాన్ పల్లి లో కూడా కొనుగోలు చేయకపోవడం వల్ల వడ్లు మొత్తం చెదలు పట్టిపోతున్నాయన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గమైన అల్లాదుర్గం మండలం, వెంకటాపూర్ గ్రామంలో ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ వడ్లు కూడా కొనలేదన్నారు. ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయి సమస్యలు వదిలేసి "నేను మళ్ళీ గెలుస్తా, తొక్కుతా, పండబెడతా" అంటూ తొండల భాష, తోతరి భాష మాట్లాడుతున్నారు తప్ప రైతులకు ఏం చేశారో చెప్పడం లేదన్నారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైంది. రైతుబంధు ఇవ్వకుండా మోసం చేశారు. గత 4 నెలల నుండి రాష్ట్రంలో చనిపోయిన రైతులకు రైతుబీమా అందడం లేదు, దానిని రద్దు చేశారన్నారు. అధికారులు, మంత్రులు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే స్పందించి మరణించిన కనకయ్య కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో, మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్ధప్రాతిపదికన వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు.



## ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా ముందంజ

**ముద్ర ప్రతినిధిజిల్లా మెదక్ :**

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 5607.28 కోట్ల రూపాయల రుణాలు పంపిణీ చేసి 85.05 శాతం లక్ష్యం పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్లో కన్వీనర్ ఎల్డీఎం బాపూజీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందజేయడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకం అన్నారు. వ్యవసాయం, స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎల్డీఎం మేనేజర్ బాపూజీ గణాంకాలను వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 వరకు 5607.28 కోట్ల రూపాయలు వివిధ రంగాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. డిఆర్డిఓ శ్రీనివాస రావు, మెప్మా పిడి హనుమంత్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ సరస్వతి, ఆర్బిఐ ప్రతినిధి శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం కృష్ణ చైతన్య, వివిధ బ్యాంకుల ఏజీఎంలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వరి అవశేషాలు కాల్చిన రైతుకు 5 వేల జరిమానా

**ముద్ర, కోరుట్ల :**

కథలాపూర్ మండలం రాజారాం తండా గ్రామానికి చెందిన రైతు భూక్య నంద్య నాయక్‌కు గ్రామ పంచాయతీ అధికారులు రూ.5 వేల జరిమానా విధించారు. పంట కోత అనంతరం వరి అవశేషాలను పొలంలో కాల్చినట్లు గుర్తించిన అధికారులు ప్రభుత్వ జీవో నిబంధనల మేరకు చర్యలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా వరి అవశేషాల దహనాన్ని నిషేధించిన నేపథ్యంలో జరిమానా విధించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఇందుకు సంబంధించిన జరిమానా రసీదును రైతుకు అందజేశారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని అధికారులు సూచించారు.



## శివ కేశవులు వేరు కాదు

- బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ...




**ముద్ర, కోరుట్ల:**

విశ్వాన్ని నడిపించే శివకేశవులు ఇరువురు వేరువేరు కాదని, మనము చూసే చూపులు, చేసే భావనలో తేడా మాత్రమేనని శృంగేరి శారదా పీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా 6వ కార్యక్రమంగా శ్రీ వామన మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం శనివారం కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో ఘనంగా ప్రారంభమైంది. మొదట ప్రముఖ న్యాయవాది సమితి న్యాయ సలహాదారు తోకల రమేష్ దంపతులు గురువందనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రవచనంలో భాగంగా మహేశ్వరశర్మ మాట్లాడుతూ కొందరు ఆ పరమాత్మను శివునిగా తలిస్తే, మరికొందరు ఆ పరబ్రహ్మను విష్ణుమూర్తిగా కొలుస్తున్నారన్నారు. ఎవరు ఎలా భావించుకొని పూజించినా తప్పులేదు కానీ, మా విధానమే గొప్పది, మా దేవుడే గొప్ప అనడమే సనాతన ధర్మానికి అవరోధం అన్నారు. ప్రపంచానికి అవసరమైన ఎన్నో అద్భుతమైన విషయాలను వేదవ్యాస మహర్షి 'అష్టాదశ మహా పురాణాల్లో' పొందుపరిచారన్నారు. పులస్త్య మహాముని, నారద మహర్షికి వామన అవతార విశేష కథను తెలపడం 'వామన మహాపురాణం'లో చెప్పబడింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల జగన్, పడిగెల శ్రీనివాస్, బట్టు హరికృష్ణ, రేగొండ రాజారం, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బాల పంచాయతీలతో సురక్షిత గ్రామాలు

- పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు వేదిక
- ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు. బాలల భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం పాపన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేలా బాల పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై బాల పంచాయతీ ప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధి, బాలల సంక్షేమంలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. బాల పంచాయతీ సభ్యులు గుర్తించిన సమస్యలను అధికారులు సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బాలల అనుకూల వాతావరణం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు, సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్, యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్విక, విజన్ ఎన్‌జీఓ ప్రతినిధులు రాజు, యాదగిరి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, పీఎం శ్రీ పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు శ్రీకాంతప్ప, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాములు, కిష్టయ్య, నాయకులు శివయ్య, సంగమేష్, ప్రసాద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 07.06.2026
www.mudranews.in | @mudranews






# చండీగఢ్ టెస్ట్ లో భారత్ దూకుడు

**గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలు** **ఇండియా 368–3**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
అనుకున్నట్టుగానే చండీగఢ్ టెస్ట్ సాగుతోంది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా దూసుకుపోతోంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉండ డంతో టీమ్ ఇండియా ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరుగుతున్న ఈ టెస్ట్ లో భారీ విజయాన్ని సాధించాల్సి ఉంది. దానిని మనసులో పెట్టుకున్న భారత బ్యాటర్లు దూకుడుగా పరుగులు సాధిస్తున్నారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆఫ్ఘనిస్తాన్ జట్టు మీద సంపూర్ణమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఓపెనర్ కేఎల్ రాహుల్ (100), సాయి సుదర్శన్ (81) కదం తొక్కితే.. కెప్టెన్ గిల్ (103★), రిషబ్ పంత్ (50★) సత్తా చూపించారు. ఫలితంగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా మూడు వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. రెండో రోజు కూడా ఇదే జోరు కొనసాగించి ప్రత్యర్థి జట్టు మీద మరింత ఒత్తిడి పెంచాలని భావిస్తోంది. టీమిండియా ప్లేయర్లు తమకు లభించిన జీవధానాలను సద్వినియోగం చేసుకోవడంతో.. భారీ స్కోర్ సాధ్యమైంది. కొంతకాలంగా వైట్ బాల్ ఫార్మాట్ మాత్రమే టీమిండియా ప్లేయర్లు ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో రెడ్ బాల్ ఫార్మాట్ లో సెట్ అవ్వడానికి టైం తీసుకుంటారని అభిమానులు అనుకున్నారు. కానీ అలాంటిదేమీ లేకుండా టీమిండియా బ్యాటర్లు స్వేచ్ఛగానే బ్యాటింగ్ చేశారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలింగ్ లోపాలను సద్వినియోగం చేసుకొని పరుగులు రాబట్టారు. జైస్వాల్ (24) మినహా మిగతా బ్యాటర్లు మాత్రం దుమ్మురేపారు. ఫలితంగా భారత్ భారీ స్కోర్ చేయగలిగింది. ఈ పిచ్ స్పిన్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుందని వార్తలు వచ్చాయి. పైగా ఐపీఎల్ సాగుతున్నప్పుడు బ్యాటర్లకు స్వర్గధామంగా ఈ మైదానం ఉంది. అయితే భారత బ్యాటర్లు మాత్రం ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆఫ్ఘనిస్తాన్ లో రషీద్ ఖాన్ లేకపోవడంతో.. ఆ లోటు స్పష్టంగా కనిపించింది. బౌలర్లు ఖచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ స్థాయిలో బంతులు వేయలేకపోవడంతో.. భారత బ్యాటర్లు పండగ చేసుకున్నారు. కొన్ని సందర్భాలలో భారత బ్యాటర్లను అవుట్ చేసే అవకాశాలు వచ్చినప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్లు ఉపయోగించుకోలేకపోయారు. దీంతో భారత్ భారీ స్కోర్ చేసింది.రెడ్ బాల్ ఫార్మాట్లో ఈ కాలపు రాహుల్ ద్రావిడ్ లాగా పేరు తెచ్చుకున్నాడు కేఎల్ రాహుల్. మరోసారి తాను ఎందుకు అంత స్పెషలో నిరూపించుకున్నాడు. క్లాసిక్ షాట్లు ఆడుతూ అదరగొట్టాడు. కెప్టెన్ గిల్ కూడా అదే స్థాయిలో బ్యాటింగ్ చేశాడు. పిచ్చి బంతులను బౌండరీలకు తరలించిన అతడు.. ఇబ్బంది పెట్టే బంతులకు రెస్పెక్ట్ ఇచ్చాడు. రిషబ్ పంత్ ఐపీఎల్ విఫలమైనప్పటికీ.. రెడ్ బాల్ ఫార్మాట్లో మాత్రం అదరగొట్టాడు. ఇప్పటికైతే 70 బంతుల్లో 50 పరుగులు చేసిన అతడు.. రెండవ రోజు ఇదే దూకుడు కొనసాగిస్తే సెంచరీ పూర్తి చేసుకుంటాడు.




# సూర్యవంశీ పంట పండింది

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియాకు ఆడకముందు ప్రపంచ రికార్డు బద్దలు..అండర్ 19 లో అదరగొట్టాడు. ఐపీఎల్ లో సత్తా చూపించాడు. అనేక రికార్డులను తన పాదాక్రాంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఏకంగా టీమిండియాలో చోటు సంపాదించాడు. టీమిండియాలో ఆడకముందే సరికొత్త రికార్డును బద్దలు కొట్టాడు. అతడు మరెవరో కాదు వైభవ్ సూర్యవంశీ.వైభవ్ సూర్యవంశీకి అనుకున్నట్టుగానే జాతీయ జట్టులో చోటు లభించింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్, ఏషియన్ గేమ్స్ లో చోటు దక్కించుకున్నాడు. 'అతడి ఆట తీరు చూసిన తర్వాత జాతీయ జట్టులోకి ఎంపిక చేయకుండా ఎలా ఉంటాం. అతడు ఆడుతున్న తీరు అమోఘంగా ఉందని' అంతటి గౌతమ్ గంభీర్ అన్నాడంటే బుడ్డోడి విధ్వంసం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.జాతీయ జట్టుకు ఎంపిక కావడం ద్వారా వైభవ్ సూర్యవంశీ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ క్రికెట్ లో టీమిండియా తరఫున అరంగేట్రం చేస్తున్న యంగ్ క్రికెటర్ గా అతడు ఘనత వహించబోతున్నాడు. సచిన్ టెండూల్కర్ 16 సంవత్సరాల 205 రోజులకు టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. సూర్యవంశీ 15 సంవత్సరాల వయసులోనే టీమిండియాలోకి ప్రవేశించబోతున్నాడు. సచిన్ రికార్డును బద్దలు కొట్టిన సూర్యవంశీ.. సరికొత్త ఘనతను తన పేరు మీదు రాసుకున్నాడు.ఈనెల 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్ లో గొప్పగొప్ప ప్లేయర్లు ఆడుతున్నప్పటికీ వైభవ్ సూర్యవంశీ మీదే అందరి కళ్లూ ఉన్నాయి. ఎందుకంటే అతడు గనుక సత్తా చూపిస్తే టీమిండియాకు తిరుగుండదు. ఈ ఐపీఎల్ ఆడినట్టుగానే ఆడితే మాత్రం టీమిండియా స్కోరు రాకెట్ వేగంతో దూసుకుపోవడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చిన్న వయసులోనే టీమిండియాలో చోటు సంపాదించుకున్న సూర్యవంశీ అనేక రికార్డులను బద్దలు కొట్టాలని అతడి అభిమానులు కోరుకుంటున్నారు.

## భార్య నుంచి ఫోన్..

**సునీల్ గవాస్కర్ లో భయాన్ని చూడాలి..**
**మామూలు వీడియో కాదు ఇది**



క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆటగాడిగా, సారధిగా, వ్యాఖ్యాతగా, విశ్లేషకుడిగా ఇలా అనేక రకాల పాత్రలు పోషించాడు అతను. 70 సంవత్సరాలు దాటిన వయసులో కూడా ఇప్పటికి ఆయన క్రికెట్ తో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. జట్టు బాగా ఆడితే అభినందిస్తారు. సరిగ్గా ఆడకపోతే ముఖం మీద తిడతారు. ఎలాంటి ప్రణాళికల రూపొందించుకోవాలి.. ప్రత్యర్థి జట్లను ఎలా ఓడించాలి.. అనే అంశాల మీద ఆయన తనదైన శైలిలో విశ్లేషణ చేస్తూ ఉంటారు. యంగ్ ప్లేయర్లకు మార్గ నిర్దేశం చేస్తూనే ఉంటారు. సునీల్ గవాస్కర్ మొహమాటం లేకుండా మాట్లాడుతారు. ఆ మధ్య ఆస్ట్రేలియాలో నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేసినప్పుడు స్టాండింగ్ ఓవియేషన్ ఇచ్చారు. అతని దగ్గరికి వెళ్లి కరచాలనం తీసుకున్నారు. ఇటీవల ఐపీఎల్లో సూర్య వంశీ అదరగొడుతుంటే లగే రహో బేటా అంటూ దీవెనలు అందించారు. ఆయనకు సెన్సాఫ్ హ్యూమర్ అధికంగా ఉం టుందని అనేకమంది దిగ్గజ ప్లేయర్లు చెప్పారు. దానిని అనేక సందర్భాలలో నిరూపించుకున్నాడు సునీల్ గవాస్కర్. అయితే అతడిలో భయాన్ని మాత్రం ఇంతవరకు ఎవరు చూడ లేదు. తొలిసారి దానిని చూసే అవకాశం ఇటీవల లభించింది. దానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. సునీల్ గవాస్కర్ సేవా కార్యక్రమాలలో కూడా పాల్గొంటాడు. ఇటీవల అతడు ముంబైలో రోటరీ క్లబ్ లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతుండగా ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చూడకుండానే అతడు తన భార్య అయి ఉంటుందని భావించి.. లిఫ్ట్ చేసాడు. షార్ట్ స్పీచ్ అని పెట్టేశాడు.. ఎక్కువగా మాట్లాడకూడదని చెప్పడానికే నా భార్య ఇలా కాల్ చేసి ఉంటుందని అనడంతో.. అక్కడున్న వారు గొల్లుమన్నారు."నా భార్య నన్ను అనేక సందర్భాలలో హెచ్చరిస్తూనే ఉంటుంది. ఎక్కువ మాట్లాడకూడదు అని చెబుతూనే ఉంటుంది. అందువల్ల నేను షార్ట్ స్పీచ్ అని చెప్పాను" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# సూర్యాని పక్కనపెట్టి.. అయ్యర్ కు కెప్టెన్సీ అందుకే..



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
వన్డే, టెస్ట్ మాత్రమే కాదు.. టి20 ఫార్మాట్లో కూడా గౌతమ్ గంభీర్ ప్రయోగాలు మొదలుపెట్టాడు. టీమ్ ఇండియాకు పొట్టి ఫార్మాట్ లో తిరుగులేదు. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో టీమిండియా 2024 నుంచి ఇప్పటివరకు ఒక్క ట్రోఫీ కూడా కోల్పోలేదు. పైగా వరుసగా 2026 లో కూడా t20 వరల్డ్ కప్ గెలిచింది. 2024లో రోహిత్ నాయకత్వంలో టీమిండియా పొట్టి ప్రపంచ కప్ అందుకుంది. అంతకుముందు అంటే 2007లో ధోని నాయకత్వంలో టీమిండియా పొట్టి ప్రపంచ కప్ సాధించింది. ఐపీఎల్ వల్ల కొత్త కొత్త ప్లేయర్లు అందుబాటులోకి వస్తున్నారు. వారంతా కూడా అద్భుతంగా ఆడుతున్నారు. అందువల్లే పొట్టి ఫార్మాట్ లో కూడా ప్రయోగాలు చేసేందుకు గౌతమ్ గంభీర్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే వచ్చే ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లకు టీమిండియా ను ప్రకటించాడు.. ఇదే జట్టు ఏషియన్ గేమ్స్ లో కూడా ఆడుతుందని ప్రకటించాడు.. భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించబోతున్నాడు. వైస్ కెప్టెన్ గా తిలక్ వర్మ వ్యవహరిస్తాడు. యువ సంచలనం సూర్య వంశీకి జట్టులో చోటు లభించింది.. సూర్య కుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయారు. సంజు శాంసన్ ,అభిషేక్ శర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, అక్షర్ పటేల్, హర్షిత్ రానా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్ దీప్ సింగ్, శివం దుబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్య వంశీ వంటి ప్లేయర్లకు ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ లో అవకాశం లభించింది. ఇక ఏషియన్ గేమ్స్ లో బుమ్రా కు చోటు లభించింది. కొంతకాలంగా సూర్య ఆటగాడిగా తన ప్రతిభను చూపించలేకపోతున్నాడు. జట్టు ను ముందుకు నడిపించడంలో అతడు విజయవంతమవుతున్నప్పటికీ.. ఆటగాడిగా మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోతున్నాడు. పరుగులు తీయలేకపోతున్నాడు. తాజాగా ఐపీఎల్లో కూడా అతడు అంతగా సత్తా చూపించలేకపోయాడు. అందువల్ల మేనేజ్మెంట్ అతడికి రెస్ట్ ఇచ్చినట్టు తెలుస్తోంది.. అయితే ప్రస్తుతం టి20 జట్టులో విపరీతమైన పోటీ ఉంది. ఆ పోటీ ఎలా ఉంటుందో సూర్యకు తెలిసినప్పటికీ.. అతడు సరిగ్గా తన ఆటతీరును మెరుగుపరుచుకోలేకపోయాడు. హార్దిక్ పాండ్యా కూడా వచ్చిన అవకాశాలను వినియోగించుకోలేకపోయాడు. రింకూ సింగ్ కూడా అలానే ఆడలేకపోవడంతో.. వీరి ముగ్గురిని మేనేజ్మెంట్ పక్కన పెట్టింది.అయ్యర్ కొంతకాలంగా స్థిరమైన ఆట తీరు కొన సాగిస్తున్నాడు. . అతడికి టి20 లలో అంతగా అవకాశాలు రాలేదు. అయినప్పటికీ ఐపీఎల్ ద్వారా తాను ఏమిటో నిరూపించుకున్నాడు. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్ లో కూడా అతడు అదరగొట్టాడు. పక్కటెముకలు గాయం కారణంగా కొద్దిరోజుల పాటు క్రికెట్ కు దూరంగా ఉన్నాడు. 2024లో అయ్యర్ నాయకత్వంలో కోల్కతా ఐపిఎల్ ఛాంపియన్గా ఆవిర్భవించింది.. ఆటగాడిగా ఏ స్థానంలోనైనా అయ్యర్ బ్యాటింగ్ చేయగలడు. అందువల్లే గౌతమ్ గంభీర్ అయ్యర్ వైపు మొగ్గు చూపించినట్టు తెలుస్తోంది. వరుసగా మూడు సిరీస్ లకు నాయకుడిగా అయ్యర్ కు ప్రమోషన్ లభించిన నేపథ్యంలో ఇన్ని రోజులపాటు చూసిన ఎదురుచూపుకు ఫలితం లభించింది.

## రుతురాజ్ గైక్వాడ్ కాదు.. విరాట్ స్థానంలో ఆడేది అతడే..




ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో ఈనెల 13 నుంచి వన్డే సిరీస్ జరుగుతుంది. ఈ సిరీస్ కోసం మేనేజ్మెంట్ జట్టును ప్రకటించింది.. 2027 వన్డే వరల్డ్ కప్ ను లక్ష్యంగా పెట్టుకొని మేనేజ్మెంట్ ఈ నిర్ణయం తీసుకునట్టు కనిపిస్తోంది. అయితే ఈ సిరీస్లో టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఆడే అవకాశం కనిపించడం లేదు. అతడికి గాయం కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల ఐపీఎల్లో బెంగళూరు జట్టు తరుపున ఆడిన విరాట్ కోహ్లీ వేగంగానే పరుగులు చేశాడు. అయితే అతడికి గాయం కావడంతో విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పారు. దీనికి తోడు 2027 వన్డే వరల్డ్ కప్ ను లక్ష్యంగా పెట్టుకొని మేనేజ్మెంట్ అతడికి విశ్రాంతి ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే నిన్నటి వరకు మీడియాలో విరాట్ కోహ్లీ స్థానంలో ఐపీఎల్లో చెన్నై జట్టు కెప్టెన్ గైక్వాడ్ కు అవకాశం ఇస్తారని వార్తలు వచ్చాయి. దీనిపై అధికారికంగా మేనేజ్మెంట్ క్లారిటీ ఇవ్వలేదు. కాకపోతే నిప్పు లేనిదే పొగ రాదు కాబట్టి ఇదంతా నిజమేనని అందరు అనుకున్నారు. కానీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టారు. విరాట్ కోహ్లీ స్థానంలో గైక్వాడ్ కాకుండా జైస్వాల్ ఆడతాడని అగార్కర్ స్పష్టం చేశాడు. "విరాట్ గాయం వల్ల ఈ సిరీస్ ఆడటం లేదు. అతడి స్థానంలో జైస్వాల్ ఆడుతాడు. సూర్యకుమార్ యాదవ్ సరైన ఫామ్ లో లేకపోవడంతో టి20 జట్టుకు అతని ఎంపిక చేయలేదు. వైభవ్ ఆట తీరు చూసిన తర్వాత ఎంపిక చేయక తప్పలేదు.. కొన్ని సంవత్సరాలుగా అయ్యర్ అన్ని ఫార్మాట్లలో అదరగొడుతున్నాడు. అందువల్లే సారధిగా అతడిని ఎంపిక చేసామని" అగార్కర్ స్పష్టం చేశాడు. మరోవైపు గైక్వాడ్ ఇటీవల సౌతాఫ్రికా తో జరిగిన సిరీస్లో అదరగొట్టాడు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. అయితే జైస్వాల్ సూపర్ ఫామ్ లో ఉన్న నేపథ్యంలో.. అతడికి అవకాశం ఇచ్చినట్టు తీరుస్తోంది. ఒకవేళ జైస్వాల్ గనక విఫలమైతే అప్పుడు గైక్వాడ్ కు చోటు లభించే అవకాశం ఉంది. ఐపీఎల్ లో గైక్వాడ్ చెన్నై జట్టును ఆశించిన స్థాయిలో ముందుకు నడిపించలేకపోయాడు. ఆటగాడిగా కొన్ని సందర్భాలలో విఫలమయ్యాడు. నాయకుడిగా కూడా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యాడు. అందువల్లే అతడికి ఆఫ్ఘనిస్తాన్ సిరీస్ లో అవకాశం లభించలేదని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే గైక్వాడ్ కు త్వరలోనే జాతీయ జట్టులో చోటు లభిస్తుందని అతడి అభిమానులు భావిస్తున్నారు.

# ఆఫ్గనిస్తానే కదా అని నిర్లక్ష్యం వద్దు..

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్:**
టీమిండియా వీటి మీద దృష్టి పెట్టాల్సిందే.. దాదాపు 7 నెలల విరామం తర్వాత టీమిండియా ప్లేయర్లు తెలుపు రంగు దుస్తులు వేసుకోబోతున్నారు. స్వదేశం వేదికగా ఆఫ్గనిస్తాన్ జట్టుతో ఏకైక టెస్ట్ ఆడబోతున్నారు. టెస్ట్ క్రికెట్లో ఆఫ్ఘనిస్తాన్ పసికూన. అలాగని ఆ జట్టులో భయంకరమైన ప్లేయర్లు ఉన్నారు. ఏదైనా జరగరనిది జరిగితే భారత్ కు ఇబ్బంది తప్పదు. అసలే డబ్ల్యూటీసి పాయింట్లలో భారత్ ఆరవ స్థానంలో ఉంది. అలాంటప్పుడు ఆఫ్గనిస్తాన్ జట్టుతో జరిగే ఏకైక మ్యాచ్ భారత జట్టుకు అత్యంత ముఖ్యం. ఈ మ్యాచ్లో కనుక భారత్ భారీ తేడాతో గెలిస్తే.. డబ్ల్యూటీసి పాయింట్లలో తన స్థానాలను మెరుగుపరుచుకుంటుంది.చండీగఢ్ కొత్త స్టేడియంలో శనివారం నుంచి ఈ టెస్ట్ జరుగుతుంది.. ఇటీవల ఈ మైదానంలో ఐపీఎల్ మ్యాచ్లు జరిగాయి. ఆఫ్ఘనిస్తాన్ జట్టులో రషీద్ ఖాన్ లేడు. అలాగని ఆ జట్టు అంత సులభంగా కనిపించడం లేదు. టి20 ఫార్మాట్.. వన్డే ఫార్మేట్ లో పెద్ద పెద్ద జట్లకు షాక్ ఇచ్చిన ఆఫ్ఘనిస్తాన్.. టెస్ట్ క్రికెట్లో కూడా అదే స్థాయిలో ఆడితే మాత్రం భారత జట్టుకు ఇబ్బందులు తప్పవు. టెస్ట్ క్రికెట్లో స్వదేశంలో టీం ఇండియాకు గతంలో తిరుగు లేని రికార్డు ఉండేది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల చేతిలో దారుణమైన పరాభవాలు ఎదురు కావడం టీమిండియా ఆట తీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రోహిత్, కోహ్లీ, అశ్విన్ వీడ్కోలు పలికిన తర్వాత టెస్ట్ జట్టు కాస్త కళ తప్పింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ విభాగంలో టీమిండియా ఆరో స్థానంలో ఉండడంతో ఈ మ్యాచ్ గెలవడం అత్యంత అవసరం.. ఈ మ్యాచ్లో జడేజా కూడా లేడు. అశ్విన్ రిటర్మెంట్ తీసుకోవడం.. జడేజా లేకపోవడం ఒకరకంగా టీమ్ ఇండియాకు ఇబ్బంది. భారత స్పిన్ విభాగాన్ని కులదీప్ యాదవ్ ముందుండి నడిపించాల్సిన అవసరం ఉంది. వాషింగ్టన్ సుందర్ కూడా అతడికి సహకారం అందిస్తాడు. ఇక హర్ష్ దూబే, మానవ సుతార్ ఎవరో ఒకరు జట్టులోకి వస్తారు. సిరాజ్ పేస్ బౌలింగ్ దళానికి నాయకత్వం ఇస్తాడు. ప్రసిద్ధి కృష్ణ అతడితోపాటు బంతి పంచుకుంటాడు. బుమ్రా కు విశ్రాంతి ఇచ్చారు.. ఓపెనర్లుగా జైస్వాల్, కేఎల్ రాహుల్ బరిలోకి దిగుతారు.. సాయి సుదర్శన్ మూడో స్థానం..గిల్, పంత్, జురెల్, సుందర్ తర్వాత స్థానాలలో బ్యాట్ అందుకుంటారు.. భారత్ ఒకవేళ ముందుగా బ్యాటింగ్ చేస్తే రెండవ ఇన్నింగ్స్ ఆడకుండానే.. భారీగా పరుగు చేస్తున్న అవసరం ఉందని అభిమానులు భావిస్తున్నారు. 2018లో ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో భారత్ బెంగళూరు వేదికగా ఒక టెస్ట్ ఆడింది. ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక ఈ మైదానం లో నల్లటి మట్టితో కూడిన పిచ్ రూపొందించారు. బ్యాటింగ్ కు అనుకూలంగా ఉంటుంది. వర్షం ముప్పు లేదు. కాకపోతే ప్రారంభంలో పేస్ బౌలర్లకు.. ఆ తర్వాత స్పిన్ బౌలర్లకు మైదానం అనుకూలిస్తుంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 07.06.2026
www.mudranews.in | @mudranews




# 'ధురంధర్' దెబ్బ..

**దావూద్ ఇబ్రహీం ముఠాలో ప్రకంపనలు..**
**పరారీ లో నాయకుడు..**



**ముద్ర సినిమా డెస్క్:**
ఇండియన్ బాక్స్ ఆఫీస్ వద్ద 'ధురంధర్' సిరీస్ సృష్టించిన ప్రభంజనం ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ సిరీస్ తో దర్శకత్వ ప్రతిభ కి చిరునామా అంటే ఏంటో అర్థం అయ్యేలా చేశాడు డైరెక్టర్ ఆదిత్య దర్. స్టోరీ , స్క్రీన్ ప్లే , నటీనటుల అద్భుతమైన నటన , ఇవన్నీ టాప్ రేంజ్ లో ఉండడం వల్లే, ఈ సినిమా ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ గా నిల్చింది. ఇదంతా పక్కన పెడితే 'ధురంధర్ 2' లో డైరెక్టర్ ఆదిత్య దర్ అండర్ వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీం ని ఎంత బలహీనంగా చూపిస్తాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కాటికి కాళ్ళు చాపుకొని కూర్చున్నవాడిగా అతన్ని చూపిస్తారు. అలా చూపించడం దావుద్ ఇబ్రహీం కి తీవ్రమైన ఆగ్రహాన్ని రప్పించాయని లేటెస్ట్ గా అందుతున్న వార్త. బాలీవుడ్ ని దావుద్ స్థాపించిన డీ కంపెనీ దశాబ్దాల నుండి ఏలుతూ వస్తోంది.బాలీవుడ్ టాప్ డైరెక్టర్స్ , సూపర్ స్టార్స్ , నిర్మాతలు ఇలా అందరూ కూడా దావూద్ క్రింద పని చేస్తుంటారు. బాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు కూడా దావూద్ ఫండింగ్ చేసాడు. ఆయన ఏమి చెప్తే అది చేసేవాళ్ళు బాలీవుడ్. అలాంటి బాలీవుడ్ నుండి తనకు వ్యతిరేకంగా ఒక సినిమా రావడం పై డీ కంపెనీ తీవ్రమైన ఆగ్రహం తో ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ లో ఉంటూ దావూద్ ఇబ్రహీం ముంబై లో ఈ డీ కంపెనీ ని నడుపుతున్నాడు. అయితే ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యాక, దావూద్ ఇబ్రహీం ముంబై లో తన ముఠా కి సంబంధించిన నెట్వర్క్ మొత్తాన్ని యాక్టీవ్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ముంబై లో కొన్ని ఉగ్ర దాడులు కూడా దావూద్ స్కెచ్ వేశాడట. ఈ ఉగ్ర కుట్రలో కొత్త సభ్యులను నియమించినట్టు తెలుస్తోంది. ఈ నియామక ప్రక్రియ నీవు షకీల్ ముఠాకి అప్పగించినట్టు తెలుస్తోంది.వీళ్లకు పాకిస్థాన్ ISI శిక్షణ ఇవ్వడం, ఆయుధాలు ఇవ్వడం వంటివి చేయనుందట. అంతే కాకుండా ఈ ఉగ్ర ప్రణాళిక ను అమలు చేసే బాధ్యతను షూటర్ మున్నా జింగాడా కు అప్పటించినట్టు సమాచారం. అయితే ఈ ఆపరేషన్ వెనుక అసలు కారణాలు మాత్రం చెప్పలేదని విస్వసనీయ వర్గాల సమాచారం. ముంబైలో దావూద్ ఇబ్రహీం అంటే భయం పోయింది , తన మీద వ్యక్తిరేకంగా సినిమాలు చేసే స్థాయికి వెళ్లిపోయారు, వారిలో పోయిన భయాన్ని తిరిగి రప్పించాలంటే కచ్చితంగా మరోసారి ఉగ్ర దాడులు చెయ్యాలి, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అంచనా వేస్తున్నారు విశ్లేషకులు. అయితే ఇటీవలే ముంబై పోలీసులు ఈ ఉగ్ర ప్రణాళిక ని భగ్నం చేశారు , అదుపులోకి తీసుకున్న కీలక సభ్యుల నుండి ఈ సమాచారం మొత్తాన్ని బయటకు లాగారు. ఈ కుట్ర ప్రణాళిక లో కొంతమంది పరారీలో ఉన్నారు , వాళ్ళ కోసం పోలీసులు గాలిస్తున్నట్టు సమాచారం.


# పెద్ది మూవీని అక్కడికే ఆపేసుంటే బాగుండేదేమో




**ముద్ర సినిమా డెస్క్:**
రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తనకెక్కిన 'పెద్ది' సినిమా రీసెంట్ గా రిలీజ్ అయింది. మొదటి చోటును సంపాదించుకున్న ఈ మూవీ ప్రస్తుతం సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుంది. ఈ వీకెండ్ మొత్తం పెద్ది సినిమా హవా నే కొనసాగుతుంది. ప్రేక్షకులందరు ఈ సినిమా చూడడానికి విపరీతంగా ఆసక్తిని చూపిస్తున్నారు. అయితే ఒకసారి సినిమా చూసిన తర్వాత మరోసారి రిపీటెడ్ గా ఈ సినిమాను చూసే జనాల సంఖ్య తగ్గిపోయింది. కారణం ఏంటంటే రిపీటెడ్ గా సినిమాను చూసే అంత గొప్ప కంటెంట్ అయితే ఈ సినిమాలో ఏమీ లేదని చాలామంది చెబుతున్నారు. నిజానికి కొన్ని సందర్భాల్లో బోరు కూడా కొట్టిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాంటి పెద్ది సినిమా విషయంలో చాలామంది చెబుతున్న అభిప్రాయాన్ని బట్టి చూస్తే అది కరెక్టే అనిపిస్తుంది. ఇంతకీ ఏం చెబుతున్నారు అంటే రామ్ చరణ్ క్రికెటర్ గా రాణిస్తాడు. ఆ తర్వాత కుస్తీ ఫైట్ లో కూడా తన సత్తా ఏంటో చూపిస్తాడు. ఈ సినిమాని కుస్తీ ఫైట్ లక్ష్యంగా పెట్టుకొని చేసే ఉంటే బాగుండేది. అది కాదని సినిమాని ఇంకా లాగుతూ రన్నర్ గా చూపించే ప్రయత్నం చేశారు. మొత్తానికైతే ఈ ప్రయత్నాలన్నీ బాగున్నప్పటికి చూసే ప్రేక్షకుడికి మాత్రం చివరి వరకు సినిమాను చూసేంత ఓపిక లేకుండా పోయిందనే చెప్పాలి. కాబట్టి కుస్తీ ఫైట్ తోనే ఈ సినిమాకి ఒక ముగింపు పలికుంటే సినిమా లాగ్ అయ్యేది కాదు. అలాగే సినిమా చాలా క్రిస్పీగా వచ్చేది. స్క్రీన్ ప్లే ప్రకారం కూడా సినిమా చాలా ఎఫెక్టివ్ గా ఉండేదని పలువురు సినిమా మేధావులు చెబుతున్నారు. ఇక రన్నింగ్ రేస్ అనేది అనవసరంగా సినిమాలో ఇరికించినట్టు అనిపిస్తుంది తప్ప అది సినిమా ఫ్లోకి ఏమాత్రం పెద్దగా కనెక్ట్ కావడం లేదని సినిమా చూస్తున్న ప్రేక్షకులను సైతం అది ఎమోషనల్ గా టచ్ చేయడం లేదని మరి కొంతమంది భావిస్తున్నారు...

## వారణాసి మూవీ కొత్త సెట్ కి అయ్యే ఖర్చు తో
# పది సినిమాలు తీయొచ్చా?

**ముద్ర సినిమా డెస్క్:**
రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా చేస్తున్న 'వారణాసి' సినిమా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతుంది. 1500 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా పెను సంచలనాలను క్రియేట్ చేస్తుందని అందరు నమ్ముతున్నారు. నిజానికి ఈ సినిమా నుంచి వచ్చిన గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మహేష్ బాబు ఈ సినిమాలో ఐదు గెటప్ ల్లో నటిస్తున్నాడు అంటూ రాజమౌళి హింట్ అయితే ఇచ్చాడు. ఇక దానికి తోడుగా ఈ సినిమాలో పురాణాలను బేస్ చేసుకుని టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో ఈ సినిమా అయితే ఉండబోతుందట. మొత్తానికైతే ఈ సినిమాతో రాజమౌళి ప్రపంచ స్థాయి ప్రేక్షకులను మెప్పించాలనే ప్రయత్నంలో ఉన్నాడు...అయితే ఈ సినిమా కోసం కొత్తగా ఒక సెట్ అయితే వేశారట. హైదరాబాద్ శివార్లలో వేసిన ఈ సెట్టు కోసం దాదాపు 50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టుగా తెలుస్తుంది. అంత పెద్ద మొత్తంలో సెట్ ఎందుకు వేస్తున్నారంటే కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అయితే ఇంత భారీ బడ్జెట్ తో సెట్ చేయడం అనేది మామూలు విషయం కాదు. ఇదంతా చూసిన కొంతమంది ప్రేక్షకులు సైతం 'వారణాసి' సినిమాకి ఒక్క సెట్ కి అయ్యే ఖర్చు తో 10 చిన్న సినిమాలను తీయొచ్చు అంటూ వాళ్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా రాజమౌళి సినిమా అంటే ఆ మాత్రం బిజినెస్ లేకపోతే ఆ గ్రాండియర్ అనేది కనిపించదు. కాబట్టి ఇప్పటికి డబ్బులను ఖర్చుపెట్టి మరి ఆ సినిమాకు భారీ వసూళ్లను రాబట్టే ప్రయత్నం చేస్తుంటాడు... ఇక అందులో భాగంగానే ఈ సినిమా కోసం భారీ సెట్ వేసినట్టుగా తెలుస్తుంది... మొత్తానికైతే రాజమౌళి ఎవ్వరు ఊహించని రేంజ్ లో వారణాసి సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం... భారీ బడ్జెట్ తో ఈ సినిమాను తీసి అంతకు మించిన వసూళ్లను రాబట్టాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇక ఏది ఏమైనా కూడా రాజమౌళి ఈ సినిమాతో ప్రపంచస్థాయి ప్రేక్షకులను మెప్పిస్తాడా లేదా అనేది తెలియాల్సి ఉంది...




# ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పిన 'పెద్ది' దర్శకుడు



**ముద్ర సినిమా డెస్క్:**
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లను రాబడుతూ ముందుకు దూసుకుపోతుంది. ఈ సినిమాకు వస్తున్న కలెక్షన్స్ ని చూస్తుంటే , భవిష్యత్తులో కచ్చితంగా ఈ చిత్రం 400 కోట్ల గ్రాస్ మార్కుని అందుకుంటుందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. ఇదంతా పక్కన పెడితే ఈ చిత్రానికి మంచి పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ కూడా, కొన్ని సన్నివేశాలకు ప్రేక్షకుల నుండి , క్రిటిక్స్ నుండి తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా జాన్వీ కపూర్ సన్నివేశాలపై ప్రేక్షకులు మండిపడుతున్నారు. ఒక అమ్మాయిని ఇంత నీచంగా చూపిస్తారా ?, పెద్ది టీం కి స్త్రీల మీద ఉన్న గౌరవం ఇదేనా అంటూ సోషల్ మీడియా లో డైరెక్టర్ బుచ్చి బాబు పై విరుచుకుపడ్డారు. అయితే సోషల్ మీడియా నుండి వస్తున్న ఈ విమర్శలపై బుచ్చి బాబు ట్విట్టర్ ద్వారా రెస్పాన్స్ ఇచ్చాడు.ఆయన మాట్లాడుతూ 'ఒక ఫిలిం మేకర్ గా ప్రేక్షకులను ఎంటర్టైన్ చెయ్యాలి, వాళ్ళని సినిమా తో ఉత్తేజపరచాలి అని బలంగా నమ్మేవారిలో ఒకరిని నేను. కానీ వినోదాన్ని పంచే క్రమం లో ఎవరినీ కూడా అసౌకర్యానికి గురి చెయ్యకూడదు. పెద్ది చిత్రం లోని కొన్ని సన్నివేశాలకు ఆడియన్స్ నుండి వచ్చిన ఫీడ్ బ్యాక్ ని మేము తీసుకున్నాము. ఈ సందర్భంగా మీకు నేను చెప్పాలని అనుకున్నది ఏమిటంటే , మహిళలపట్ల నాకు ఎల్లప్పుడూ అపారమైన గౌరవం ఉంటుంది, ఏ స్త్రీ పాత్రని కూడా ఒక వస్తువుగా చూపించడం కానీ , వాళ్ళని అగౌరవపరచడం కానీ నా ఉద్దేశ్యం కాదు.కానీ కొన్ని సన్నివేశాలు మిమ్మల్ని బాగా ఇబ్బందికి గురి చేశాయని తెలుస్తోంది, నా వల్ల బాధపడినందుకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్తున్నాను'.'సోషల్ మీడియా లో వచ్చిన ఈ ఫీడ్ బ్యాక్ ని తీసుకున్న మేము , ఆ సన్నివేశాలను ట్రిమ్ చెయ్యాలని నిర్ణయించుకున్నాం. ఇకపై ఇలాంటివి రిపీట్ అవ్వకుండా చూసుకుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు బుచ్చి బాబు. పెద్ది మూవీ ఫస్ట్ హాఫ్ లో హీరో రామ్ చరణ్ హీరోయిన్ జాన్వీ కపూర్ అనుమతి లేకుండా ముద్దు పెట్టుకోవడం , ఆ తర్వాత సెకండ్ హాఫ్ లో అందుకు హీరో హీరోయిన్ కి వివరణ ఇవ్వడం చూసి ఆడియన్స్ ఛీ కొట్టారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ తిట్టే తిట్లకు చెవులు మూసుకోవాల్సిందే. ఒక మంచి సినిమాలో ఇలాంటి సన్నివేశాలు పెట్టడం దృఅదృష్టకరం , ఆ సన్నివేశాల వల్ల, గొప్ప సందేశాత్మక చిత్రం పొల్యూట్ అయ్యిందని , ఇప్పుడు వాటిని తొలగించడం వల్ల ఫ్యామిలీ ఆడియన్స్ నుండి ఇంకా మంచి రెస్పాన్స్ వస్తుందని అంటున్నారు విశ్లేషకులు.

## చిరంజీవి విషయంలో
# తప్పుగా ఆలోచించిన దర్శకుడు





**ముద్ర సినిమా డెస్క్:**
మెగాస్టార్ చిరంజీవి హీరోగా చేసిన చాలా సినిమాలు ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాయి. ఇక అలాంటి సినిమాలు యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో చాలా అరుదుగా వస్తాయనే చెప్పాలి. చిరంజీవి చేసిన సినిమాలన్నింటిలో కొన్ని గొప్ప సినిమాలుగా నిలిస్తే మరికొన్ని ప్లాపులుగా కూడా మిగిలాయి. అయితే ఒక దర్శకుడు చిరంజీవి తనతో సినిమా చేయడనే ఒక అపోహతో ఉండేవారట. కానీ అదిరిపోయే కథ చెబితే చిరంజీవి ఎవరితోనైనా సరే సినిమా చేస్తారని తన సన్నిహితులు చెప్పడంతో ఒక మంచి కథను తీసుకెళ్లి చిరంజీవికి వినిపించాడు. ఇక దాంతో చిరంజీవి అతనికి అవకాశం అయితే ఇచ్చాడు. ఇంతకీ ఆ దర్శకుడు ఎవరు అంటే గుణశేఖర్ కావడం విశేషం...గుణ శేఖర్ అంతకుముందే లాఠీ, సొగసు చూడతరమా, బాల రామాయణం లాంటి సినిమాలు చేశాడు. అయితే అతని దగ్గర ఒక మంచి కథ ఉంది. అది చిరంజీవి రేంజ్ కి సరిపోతుంది కానీ చిరంజీవి నాతో సినిమా చేయడు కదా అని తన సన్నిహితులు దగ్గర చెబితే వాళ్లు చిరంజీవి కి నచ్చితే ఆయన ఎవరితో నైనా సినిమాలు చేస్తాడు అని తనకు సలహాలు ఇచ్చి చిరంజీవి దాకా ఆ కథను చేరవేసే ప్రయత్నం చేయమని చెప్పారట. దాంతో అశ్విని దత్ కి కథను వినిపించి ఆ తర్వాత అతని సహాయంతో చిరంజీవికి చెప్పాడట. చిరంజీవికి ఆ కథ నచ్చడంతో ఆ సినిమా వర్కౌట్ అయింది. 'చూడాలని ఉంది' పేరుతో తెరకెక్కిన ఈ సినిమా 100 రోజులకు పైన ఆడి భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఆ తర్వాత వీళ్ళిద్దరి కాంబినేషన్లో 'మృగరాజు' అనే సినిమా వచ్చింది. అయితే ఆ సినిమా డిజాస్టర్ కావడంతో మరోసారి చిరంజీవి గుణశేఖర్ తో సినిమా అయితే చేసే ప్రయత్నం చేయలేదు...మొత్తానికైతే అప్పటి నుంచి ఇప్పటి వరకు వీళ్ళిద్దరి మధ్య చాలా మంచి సన్నిహిత సంబంధాలైతే ఉన్నాయి...ప్రస్తుతం గుణ శేఖర్ ఒక పెద్ద ప్రాజెక్ట్ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు...

## అనిల్ రావిపుడికి
# సక్సెస్ మంత్రం తెలుసా?



**ముద్ర సినిమా డెస్క్:**
సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ సాధించడమంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ముఖ్యంగా కమర్షియల్ సినిమాలతో సక్సెస్ ని సాధించడం చాలా పెద్ద టాస్క్ అనే చెప్పాలి. అలాంటిది మొదటి నుంచి కూడా వరుసగా కమర్షియల్ సినిమాలను చేస్తూ సూపర్ సక్సెస్ లను సాధించిన వాళ్ళలో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను విపరీతంగా ఎంటర్ టైన్ చేస్తుంటాయి. కామెడీ ప్లస్ యాక్షన్ జానర్ లో ఆయన చెలరేగుతూ ఉంటాడు. ఇక ఇప్పటివరకు ఆయన చేసిన తొమ్మిది సినిమాల్లో తొమ్మిది కూడా సూపర్ సక్సెస్ లను సాధించడం అనేది నిజంగా చాలా గొప్ప విషయమనే చెప్పాలి. ఇదంతా చూస్తున్న చాలామంది సినిమా మేధావులు సైతం అనిల్ రావిపూడి సక్సెస్ ఫార్ములా ఏంటంటే ఆయన స్క్రీన్ ప్లే ను చాలా బాగా వాడుకుంటూ ఎక్కడ ఏ ఎలిమెంట్ అయితే కావాలో దాన్ని పర్ఫెక్ట్ గా స్క్రీన్ మీద ప్రజెంట్ చేసే ప్రయత్నం చేస్తాడు. అందువల్లే అతనికి ప్రేక్షకుల్లో విశేషమైన ఆదరణ లభిస్తుంది. ఆయన సినిమాలను చూసిన ప్రేక్షకులు ఒక హై ఫీల్ కి లోనవుతుంటారు. అందువల్లే ఆయన రొటీన్ ఫార్మాట్ ని ఫాలో అయినా కూడా సక్సెస్ ల మీద సక్సెస్ లను సాధిస్తూ ప్రేక్షకులకు విపరీతమైన ఎంటర్టైన్మెంట్ ని అందిస్తున్నాడు... ఇక ఏది ఏమైనా కూడా యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీని శాసించగలిగే కెపాసిటి ఉన్న కొంతమంది దర్శకులు పాన్ ఇండియాలో తమ సత్తాను చూపిస్తుంటే అనిల్ రావిపూడి మాత్రం కేవలం తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడు...ఇక ఫ్యామిలీ ఆడియన్స్ తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని ప్రతిసారి నిలబెట్టుకుంటూ వస్తున్నాడు. అందుకే ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి తో 'మన శంకర్ వరప్రసాద్' అనే సినిమా చేసి సూపర్ సక్సెస్ ని సాధించాడు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com